రేపు అల్లావుద్దీన్ నాటక ప్రదర్శన

బెంగళూరు, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): జేపీ నగర్ బ్రిగేడ్ స్కూల్ విద్యార్థులు ఇంబ్రోగ్లియో ప్రొడక్షన్ ద్వారా అల్లావుద్దీన్ జూనియర్ నాటక ప్రదర్శన శనివారం నిర్వహించనున్నారు. అంబేడ్కర్ భవన్‌లో సాయంత్రం 6 గంటలకు సంప్రదాయక కథను ఆధునిక సందేశంతో ప్రదర్శించనున్నారు. 400మంది విద్యార్థులు వేదికపై పాల్గొనన్నున్నట్టు బ్రిగేడ్ స్కూల్ ఫౌండర్ గీతా శంకర్ తెలిపారు. విద్యార్థులకు కేవలం పుస్తక పరిభాషనే కాకుండా సమాజం ఆధ్యాత్మికత గురించి తెలపాలనే నాటికను నేర్పినట్లు డైరెక్టర్ దివ్యేశ్ భండారి తెలిపారు.



మంత్రి మునియప్పతో రైతుల చర్చలు

మంత్రి ఇంటి ముందు రైతుల నిరసన

● భూములను స్వాధీనం చేసుకోవద్దని డిమాండ్

బెంగళూరు, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): భూములు కోల్పోయిన రైతులు మంత్రి ఇంటి ముందు గురువారం నిరసనకు దిగారు. దేవనహళ్ళి తాలూకా చన్నరాయపట్టణలో కేఐఏడీబీ భూముల స్వాధీనాన్ని వెంటనే రద్దు చేయాలని బాధిత రైతులు డిమాండ్ చేశారు. మంత్రి మునియప్ప ఇంటి ముందు బైఠాయించి పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. అయితే మంత్రి ఇంట్లో హోమాలు చేసుకుంటూ బిజీగా ఉండడాన్ని రైతులు జీర్ణించుకోలేకపోయారు. పలువురు రైతులు మాట్లాడుతూ కేఐఏడీబీ ఇప్పటికే నాలుగుసార్లు భూ స్వాధీనం చేసుకుందని మరింత విస్తీర్ణం అవసరమని మరోసారి సిద్ధమవుతోందన్నారు. ఉన్న భూమితో పంటలు సాగుచేసుకుని జీవనం చేసుకోవాలని భావిస్తున్నామని, పూర్తిగా భూమిని కోల్పోతే భవిష్యత్తు ఏం కావాలని ప్రశ్నించారు. 13 గ్రామాలలో 1777 ఎకరాల భూమిని స్వాధీనం చేసుకున్నారన్నారు. నలపనహళ్లి, మల్లాపుర, శ్రీమాచనహళ్ళి, చన్నరాయపట్టణ, నాగనాయకనహళ్ళి పాళ్య, యడాళు, మట్టిబార్లు, ముద్దేనహళ్ళి, కళ్ళళ్లి గ్రామాల పరిధిలో భూస్వాధీనం చేసుకున్నారు. అనంతరం మంత్రి మునియప్ప నిరసన చేస్తున్న రైతులతో చర్చించారు. ముఖ్యమంత్రితో చర్చించి ఇకపై భూముల స్వాధీనం చేసుకోకుండా చర్యలు తీసుకుంటామన్నారు. నోటీసులను వాపసు తీసుకునేలా సూచిస్తానన్నారు. దీంతో రైతులు ఆందోళన విరమించారు.

ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు రూ.25 లక్షల ప్రోత్సాహకం

● మంత్రి మహదేవప్ప



బెంగళూరు, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): పీయూసీ (ఇంటర్మీడియెట్)లో 95శాతం మార్కులు సాధించి నీట్ ర్యాంకుతో ప్రభుత్వ కళాశాలలో ఎంబీబీఎస్ సీటు రాకుండా మేనేజ్‌మెంట్ కోటాలో చేరితే తొలి ఏడాది రూ.25లక్షల ప్రోత్సాహకం అందిస్తామని సాంఘిక సంక్షేమశాఖ మంత్రి మహదేవప్ప ప్రకటించారు. ఈమేరకు ఉత్తర్వులు జారీ చేసినట్లు తెలిపారు. గురువారం మైసూరులో ఆయన మీడియాతో మాట్లాడుతూ ఎంబీబీఎస్‌లో ప్రైవేట్‌గా చదివే విద్యార్థులు రెండో ఏడాది 60శాతం మార్కులు సాధిస్తే రూ.25లక్షలు ప్రోత్సాహకం కొనసాగుతుందన్నారు. జాతీయ విద్యాసంస్థలు ఐఐటీ, ఐఐఎం, ఐఐఎస్‌సీ, ఎన్ఐటీలో ప్రవేశం పొందే ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు ప్రస్తుతం అందిస్తున్న రూ.లక్ష పారితోషికాన్ని రూ.2లక్షలకు పెంచినట్టు తెలిపారు.

ఇగలూరు ప్రాజెక్టు కట్టింది ఎవరప్పా..?

● మాజీ ప్రధాని దేవెగౌడ



బెంగళూరు, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): 17 చెరువులకు నీరు నింపడమే గొప్ప అయితే ఇగలూరు ప్రాజెక్టు కట్టింది ఎవరప్ప..? అని మాజీ ప్రధాని దేవెగౌడ ప్రశ్నించారు. చన్నపట్టణ నియోజకవర్గం తిట్టమారనహళ్ళి, మాకళి, నాగవార, బేవూరుతో పాటు పలు చోట్ల దేవెగౌడ ప్రచారం చేశారు. మాజీ సీఎం యడియూరప్పతో కలిసి పలు గ్రామాల్లో దేవెగౌడ మనవడు నిఖిల్ గెలుపుకోసం ప్రచారం చేశారు. దేవెగౌడ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ఖజానా ఖాళీ అయ్యిందని అబివృద్ధికి నిధులే లేవన్నారు. భారీ అవినీతి జరుగుతోందని రోజుకో అంశం ఏకంగా మంత్రులపైనే వస్తోందన్నారు. కాంగ్రెస్ నేతలు బలవంతంగా కుమారస్వామిని సీఎంను చేసి వారే ప్రభుత్వాన్ని కూల్చారన్నారు. గడిచిన పదేళ్లుగా రైతుల ఖాతాలకు రూ.2వేల చొప్పున జమ చేస్తున్నారని రాష్ట్ర ప్రభుత్వం తన వాటా చెల్లించకుండా స్తంభింపచేసిందన్నారు. ఐదు గ్యారెంటీలతో అధికారంలోకి వచ్చారన్నారు. నేను రైతు బిడ్డనని 90ఏళ్లలో కూడా ప్రజాసంక్షేమం కోరుతున్నా అన్నారు. నా సరిపాటి ఎస్ఎం కృష్ణ ఒక్కరే అన్నారు. మనవడి గెలుపుకోసం వృద్ధాప్యంలోనూ ప్రచారానికి వస్తున్నా అన్నారు. ప్రత్యర్థులు విమర్శించడం సరికాదన్నారు. 50ఏళ్ల కిందటే చన్నపట్టణలో కాంగ్రెస్‌ను ఓడించానన్నారు. మనవడి గెలుపుకంటే ప్రాంతీయ పార్టీలు మనుగడే ముఖ్యమని ప్రచారం కోసం వచ్చానన్నారు.



దశాబ్దన్నర కాలం.. జాప్యం..!

● ఇంటి స్థలాల కోసం 1110 కుటుంబాల ఎదురుచూపు
● ఉప ఎన్నికల ప్రక్రియ అనంతరం గ్రాంట్లు
● బీబీఎంపీ పాలనాధికారి

బెంగళూరు, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): ప్రతి కుటుంబానికి సొంతింటి కల లక్ష్యంగా ఉంటుంది. అందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక పథకాల ద్వారా ఇళ్ల నిర్మాణం చేపడతాయి. ఇంటి స్థలాల మంజూరు రాష్ట్ర ప్రభుత్వానిదే అయినా నిర్మాణాలు మాత్రం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పలు ఆవాజ్ యోజనల పేరిట దశాబ్దాలకాలంగా అమలు చేస్తున్నాయి. ప్రభుత్వాలు మారినా ఇళ్ల నిర్మాణాల పథకాలు మాత్రం కొనసాగుతూనే ఉన్నాయి. రాష్ట్రంలో ఇప్పటికీ లక్షలాదిమంది శాశ్వత ఇళ్లు లేనివారు ఉన్నారు. అభివృద్ధి చెందుతున్న పట్టణాలు, నగరాలకు వలసలు వచ్చేవారు సైతం పదేళ్లలోనే ఇంటిస్థలాలు పొందేందుకు వెసులుబాటు ఉంది. రాష్ట్రంలో గృహ నిర్మాణ శాఖ జిల్లా కేంద్రాలు, మారుమూల ప్రాంతాల్లో ఏ విధంగా పనిచేస్తుందోగానీ బృహత్ బెంగళూరు మహానగర పాలికె (బీబీఎంపీ) పరిధిలోనే ఎస్సీ, ఎస్టీలతో పాటు పౌరకార్మికులకు ఇంటి స్థలాలు కేటాయించే విషయంలో చూపిన నిర్లక్ష్యం సిగ్గుచేటుగా మారింది. ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్‌లో భాగంగా 1110మంది పౌరకార్మికులకు ఇంటి స్థలాలు మంజూరు చేసే ప్రక్రియ 16 ఏళ్లు నిండినా సంపూర్ణం కాలేదు. పేదల ఇళ్ల నిర్మాణాలకు గ్రాంటు కేటాయింపు విడుదలలో అధికారుల తీరు అద్దం పట్టేలా ఉంది. బీబీఎంపీలో పనిచేసే ఎస్సీ, ఎస్టీ కుటుంబాలకు కొత్తగా అభివృద్ధి చేసే లేఅవుట్ ప్రదేశాలలో ఉచితంగా నివాస స్థలాన్ని పంపిణీ చేయాలని 2008లో తీర్మానించారు. అందుకు అనుగుణంగా ఆదేశాలు జారీ చేశారు. బెంగళూరు ఉత్తర తాలూకా దాసనపుర హోబళి లక్ష్మీపురలో సర్వే నెంబరు 24లో 18.33 ఎకరాలు, సర్వే నెంబరు 25లో 3.9 ఎకరాలు, దక్షిణ తాలూకా కెంగేరి హోబళి అగర గ్రామంలో సర్వే నెం.28లో 7.5 ఎకరాలతో కలిపి మొత్తం 29.7 ఎకరాల భూమిని బీబీఎంపీకి రెవెన్యూశాఖ 2015లో అప్పగించింది. ఇంటిస్థలానికి లబ్ధిదారులను డివిజన్‌లవారీగా ప్రత్యేక కమిటీలు ఎంపిక చేశాయి. దక్షిణ డివిజన్‌లో 494, పశ్చిమ 206, రాజరాజేశ్వరినగర్‌లో 410తో కలిపి 1110 మంది లబ్ధిదారులను ఎంపిక చేశారు.

● బహుజన విమోచనా పోరాట సమితి సంచాలకుల వినతి మేరకు నిబంధనలకు అనుగుణంగా ఇంటి స్థలాలను కేటాయిస్తామని అప్పట్లో ప్రకటించారు. ప్రభుత్వం మంజూరు చేసిన ప్రదేశంలో మోడల్ కాలనీలుగా నిర్మించడం, మౌలిక సదుపాయాలు కల్పించేందుకు యలహంక, రాజరాజేశ్వరినగర్ డివిజన్ కమిషనర్‌లు 42.28 కోట్ల రూపాయలు అవసరంగా నివేదికలు ఇచ్చారు. ఇందుకు అనుగుణంగా కాలనీలు నిర్మించేందుకు ఎస్సీ, ఎస్టీ గ్రాంట్లను కేటాయించేందుకు అనుమతులకోసం ప్రస్తావనలు ఇచ్చారు.

● బీబీఎంపీ నిర్దేశించినట్టుగా 1110 అర్హులైన కుటుంబాలకు ప్రత్యేకంగా ఇంటిస్థలం కేటాయించే విషయమై పలుమార్లు ప్రభుత్వం దృష్టికి వచ్చింది. అయినా సాంకేతిక, ఇతర కారణాలతో వాయిదాలు పడ్డాయి. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వంలో పౌరకార్మికులకు ఇళ్లస్థలాలు కేటాయించే ప్రక్రియ పూర్తి చేయాలని కేబినెట్‌లో తీర్మానించారు. వాటిని అమలు చేసేందుకు తదుపరి చర్యలు వేగవంతం చేయాలని డీసీఎం డీకే శివకుమార్ ఫిబ్రవరి నుంచి ఇటీవల సెప్టెంబరుదాకా బీబీఎంపీ కమిషనర్‌కు నాలుగుసార్లు లేఖలు పంపారు. అయినా ప్రక్రియ సంపూర్ణం కాలేదు. ఎస్సీ, ఎస్టీ, పౌరకార్మికులైన పేద కుటుంబాలకు ఇంటి స్థలాలు కేటాయించే విషయంలో బీబీఎంపీ ఉన్నతాధికారులు, ప్రభుత్వం చూపుతున్న ఆశలకు 16 ఏళ్లు పట్టింది. ఇప్పటికైనా ప్రభుత్వం చొరవ చూపకపోతే తీవ్రమైన పోరాటాలు చేయాల్సి వస్తుందని బహుజన విమోచనా పోరాట సమితి ప్రకటించింది.

త్వరలోనే ఆమోదిస్తాం...

ఎస్సీ, ఎస్టీ గ్రాంట్లతో లే అవుట్‌లలో మౌలిక సదుపాయాలు కల్పిస్తాం. బెంగళూరు నగరాభివృద్ధి, డీసీఎం డీకే శివకుమార్ ఈ విషయమై వెంటనే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఉప ఎన్నికల ప్రక్రియ ముగియగానే గ్రాంట్లు కేటాయిస్తాం.

- బీబీఎంపీ పాలనాధికారి ఎస్ఆర్ ఉమాశంకర్

సండూరులో ప్రచార హోరు..!

● సీఎం, మాజీ సీఎం మకాం
● ఉప ఎన్నికలో విజయానికి కుల సమీకరణ
● రెండు రోజుల పాటు సీఎం సిద్దూ ఇక్కడే
● నేడు రంగంలోకి యడియూరప్ప



బళ్లారి, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): సండూరు శాసనసభ ఉప ఎన్నికల గడువు దగ్గర పడుతున్న కొద్దీ రాజకీయ వేడి మరింత ఎక్కువైయింది. ఇప్పటికే కాంగ్రెస్ మంత్రులు, ఎమ్మెల్యేలు, కమిటీలు ప్రచారం చేస్తుంటే గురు, శుక్రవారాలు సీఎం సిద్దరామయ్య రంగంలోకి దిగారు. గురువారం గ్రామాల్లో పర్యటించి వేదికల్లో ప్రసంగిస్తూ ఓటర్లను ఆకట్టుకునే ప్రయత్నం చేశారు. బీజేపీ కూడా ఎక్కడా తగ్గకుండా అతిరథ మహారథులు రంగంలోకి దిగారు. శుక్ర, శనివారాలు రెండు రోజుల పాటు మాజీ ముఖ్యమంత్రి యడియూరప్ప రంగంలోకి దిగనున్నారు. రాజకీయ కురువృద్ధులు అయిన సీఎం, మాజీ సీఎం ఇద్దరూ సండూరులోనే ఉంటూ ప్రచారం చేస్తుండడం ఆసక్తికరంగా మారింది. ముఖ్యంగా కులాల వారిగా ఓటర్లను ఆకట్టుకునేందుకు ఇద్దరూ ప్రయత్నిస్తున్నారు. సీఎం ఇక్కడే ఉండడంతో కేబినెట్‌లో సగభాగం మంత్రులు రాజకీయ హడావుడి కొనసాగిస్తున్నారు. మంత్రి సంతోష్ లాడ్, మాజీ మంత్రి నాగేంద్ర, ఎమ్మెల్యేలు గవియప్ప, నారా భరత్‌రెడ్డి, ఎంపీ తుకారాం ఇతర కాంగ్రెస్ నాయకులు పెద్ద సంఖ్యలో ఉన్నారు. మాజీ సీఎం యడియూరప్ప శుక్ర, శనివారం ఇక్కడే ఉండేందుకు టూర్ షెడ్యూల్ విడుదల చేశారు. ఇద్దరూ ఒకే నియోజకవర్గంలో ప్రచారం సాగిస్తుండడం పోలీసులకు శాంతిభద్రతల సమస్య సవాలుగా మారింది. ఇక రాజకీయంగా స్థానికంగా ఉండే ప్రజలు ఎటువైపు వెళ్లాలో తెలియక తలలు పట్టుకుంటున్నారు. తటస్తంగా ఉండే కూలీలు, సామాన్య ప్రజలు ప్రచారానికి వెళితే రోజు కూలీ వస్తుందనే ఆశతో ఆనందపడుతున్నారు. ఎన్నికలకు 5 రోజుల గడువు ఉండడంతో రాజకీయ పార్టీలు ఓట్లు కోసం ప్రచారం వేగం పెంచాయి. మొత్తం మీద సండూరులో రాజకీయం వేడెక్కింది.

50:50 నిష్పత్తిన ఇంటిస్థలాల రద్దుకు ముడా తీర్మానం

బెంగళూరు, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): మైసూరు నగరాభివృద్ధి ప్రాధికార పరిధిలో 50:50 నిష్పత్తిన కేటాయించిన ఇళ్లస్థలాలను రద్దు చేయాలని 'ముడా' సభ తీర్మానించింది. ముడాలో వివాదాలు, లోకాయుక్త, ఈడీ దర్యాప్తుల వంటి అంశాలు తలెత్తిన తర్వాత తొలిసారి గురువారం ముడా సాధారణ సభ జరిగింది. సభ్యులంతా 50:50 నిష్పత్తిన కేటాయించిన ఇంటి స్థలాలను జప్తు చేయాలని తీర్మానించారు. హైకోర్టు మాజీ న్యాయమూర్తి పీఎన్ దేశాయ్ నివేదిక వచ్చాక ప్రక్రియను అమలు చేయాలని తీర్మానించారు. ముడా సభ తర్వాత ఎమ్మెల్యే జీటీ దేవేగౌడ మాట్లాడుతూ ముడా వివాదంపై లోకాయుక్త, ఈడీ దర్యాప్తు చేస్తోందని మరోవైపు దేశాయ్ కమిషన్ విచారణ జరుపుతోందని ఈ ప్రక్రియలు పూర్తయ్యాక 50:50 నిష్పత్తిన కేటాయించిన ఇంటి స్థలాలను చట్టపరంగా ఏ విధంగా రద్దు చేయాలనే అంశాన్ని తీర్మానిస్తామన్నారు. చామరాజ నియోజకవర్గ కాంగ్రెస్ ఎమ్మెల్యే హరీశ్‌గౌడ మాట్లాడుతూ సభలో ఒక నిర్ణయం తీసుకున్నామన్నారు. 'ముడా'కు వచ్చిన అవినీతి మరక తొలగించాలన్నదే మా ఆలోచన అన్నారు. 2020 నుంచి 50:50 నిష్పత్తిన కేటాయింపులు జరిగాయన్నారు. కాగా ముడా మాజీ ఉద్యోగులు కళ్లకు గంతలు కట్టుకుని సభ జరిగే ప్రదేశానికి రావడంతో పోలీసులు అడ్డుకున్నారు.



ముడా సాధారణ సమావేశంలో ఎమ్మెల్యేలు అధికారులు



బెంగళూరు నార్త్‌లో తెలుగుదేశం పార్టీకి క్రియాశీలకంగా పనిచేసే నాయకుడు పి నవీన్‌కుమార్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అనంతపురం జిల్లా శింగనమల నియోజకవర్గ ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీని మంగళవారం అనంతపురంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఇటీవల ఎన్నికల్లో విజయం సాధించినందుకు ఆమెను సన్మానించి అభినందించారు.

- బెంగళూరు, ఆంధ్రజ్యోతి



అభ్యర్థిని పరిచయం చేస్తున్న ముఖ్యమంత్రి సిద్దరామయ్య

అసత్యప్రచారాలు చేస్తున్న బీజేపీ

● ఈడీ, సీఐడీలను అడ్డుపెట్టుకుని కేసుల్లో ఇరికిస్తోంది
● ఉప ఎన్నికల్లో కాంగ్రెస్‌దే గెలుపు: సిద్దరామయ్య

బళ్లారి, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): బీజేపీ నాయకులు అసత్యపు ప్రచారాలు చేస్తూ ప్రజలను తప్పుదారి పట్టిస్తోందని ముఖ్యమంత్రి సిద్దరామయ్య ప్రజలకు వివరించారు. పీఎం నరేంద్ర మోదీ, హోం మంత్రి అమిత్‌షా కేంద్రంలో ఈడీ, సీఐడీ సంస్థలను అడ్డుపెట్టుకుని కాంగ్రెస్ వారిని ఇరికించి భయపెట్టే పనులు చేస్తున్నారని ఘాటుగా విమర్శించారు. గురువారం సండూరు ఉప ఎన్నికల ప్రచారంలో ఆయన పాల్గొన్నారు. బొమ్మయగట్ట, చోర్నూరు, బండ్రి, యశ్వంత్ నగర, కృష్ణానగర, తారా నగర, సుశీల నగర్, దౌలత్‌పురలలో ఆయన బహిరంగ సభలలో ప్రచారం నిర్వహించారు. సండూరు ఉప ఎన్నికలలో ఎంపీ తుకారామ్ భార్య అన్నపూర్ణకు కాంగ్రెస్ అభ్యర్థిగా నిలబెట్టామని ఆమెకు ప్రజలు ఓట్లు వేసి గెలిపించాలని అభ్యర్థించారు. చాలా ఏళ్లుగా అన్నపూర్ణ కూడా ఇక్కడి ప్రజలకు సేవలు చేస్తూ వస్తున్నారని చెప్పారు. కాంగ్రెస్ పార్టీ గత ఎన్నికలలో ఇచ్చిన హామీలను నెరవేర్చామని స్పష్టం చేశారు. గృహలక్ష్మి, అన్నభాగ్య, ఇలా అన్ని పథకాలను అమలు చేస్తున్నామన్నారు. మోదీ ఏ అభివృద్ధి పనులు చేశారో చూపాలన్నారు. స్థానికంగా వున్న అన్నపూర్ణకే ఓట్లు వేసి గెలిపించాలని కోరారు. గతంలో ఇక్కడి ప్రభుత్వ సంపదను దోచుకున్న నాయకులను నమ్మి మోసపోవద్దని గుర్తు చేశారు. ఉదయం నుంచి సీఎం రాత్రి వరకు ప్రచారం చేశారు. ఆయనతో పాటు అభ్యర్థి అన్నపూర్ణ, ఎంపీ తుకారామ్, మంత్రి సంతోష్‌లాడ్, మాజీ మంత్రి రాజశేఖర్ పాటిల్, ఎమ్మెల్యే నాగేంద్ర, బుడా అధ్యక్షుడు ఆంజనేయులు, డీసీసీ మాజీ అధ్యక్షుడు రఫీక్, తాండ్ర సతీష్, కాంగ్రెస్ ప్రచారకర్త వెంకటేష్ హెగ్డే, గుమ్మనూరు జగన్, నాగరాజు, గోవర్ధన్‌రెడ్డి, అన్నా నాగరాజు పాల్గొన్నారు.

దేశంలో వచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వమే

● ఏఐసీసీ కార్యదర్శి గోపీనాథ్ పళనీయప్ప

గడిచిన పదేళ్లలో దేశంలో బీజేపీ పరిపాలన వల్ల ప్రజలు అనేక రకాలుగా ఇబ్బందులు పడుతున్నారని వచ్చే రోజుల్లో కాంగ్రెస్‌కు ప్రజలు గెలిపించేందుకు సిద్దంగా వున్నారని ఆల్ ఇండియా కాంగ్రెస్ కమిటీ నేషనల్ సెక్రెటరీ గోపీనాథ్ పళనీయప్ప విశ్వాసం వ్యక్తం చేశారు. గురువారం సండూరులో ఆయన విలేకరులతో మాట్లాడారు. బీజేపీ ప్రభుత్వంలో అన్ని వర్గాలు నష్టపోయాయని ఆయన ఆరోపించారు. కాంగ్రెస్ అధికారంలోనే ప్రజలు ప్రశాంతంగా వుంటారని చెప్పారు. కర్ణాటకలో జరుగుతున్న మూడు ఉప ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ మూడింటిలోను గెలుస్తుందని ధీమా వ్యక్తం చేశారు. సండూరు ఉప ఎన్నికలో కాంగ్రెస్ పార్టీ అఖండ మెజార్టీతో గెలుస్తుందన్నారు. బీజేపీ అధికారంలోకి వచ్చాక కులమతాలను రెచ్చగొట్టి ప్రజలను ప్రశాంతతకు దూరం చేసిందన్నారు. దేశంలో తరువాతి ప్రధాని రాహుల్ గాంధీనే అన్నారు.



టీటీడీ బోర్డు సభ్యుడిగా సన్మానం పొందుతున్న నరేశ్‌కుమార్

టీటీడీ సభ్యత్వం పూర్వజన్మ సుకృతం

● నరేశ్‌కుమార్

బెంగళూరు, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): తిరుమల తిరుపతి దేవస్థానం (టీడీడీ) బోర్డు సభ్యుడిగా అవకాశం పూర్వజన్మ సుకృతంగా భావిస్తున్నానని ఎస్ నరేశ్‌కుమార్ అన్నారు. బుధవారం బోర్డు సభ్యుడిగా ప్రమాణస్వీకారం చేసిన ఆయన గురువారం బెంగళూరులో మీడియాతో మాట్లాడారు. టీడీడీ బోర్డు సభ్యుడిగా అవకాశం దక్కడం వెనుకబడినవర్గాలకు, సవితా సమాజానికి లభించిన గౌరవమన్నారు. సమాజంలో వెనుకబడినవర్గాలకు ఇటువంటి అవకాశాలు చైతన్యం తీసుకొచ్చేందుకు కారణమవుతాయన్నారు. టీటీడీ బోర్డు సభ్యత్వం చారిత్రాత్మక అవకాశమని, బీజేపీకి చెందిన రాష్ట్ర, జాతీయ నేతలు కారణమన్నారు. సోషల్ ఇంజనీరింగ్ ద్వారా సమాజంలో మార్పుకు కారణంగా వ్యవహరిస్తున్న ఏపీ సీఎం చంద్రబాబునాయుడుకు ధన్యవాదాలన్నారు. తిరుమలలో ప్రతిరోజూ 35వేలమందికిపైగా తలనీలాలు సమర్పించే కల్యాణకట్టను సందర్శించానన్నారు. తిరుమలలో భక్తులకు తగిన సౌకర్యాలు కల్పించే విషయంలో శక్తివంచనలేకుండా పనిచేస్తానన్నారు.



కల్యాణకట్టలో సిబ్బందితో నరేశ్‌కుమార్

ఎవరి మాటా వినడు..!

పంచాయతీరాజ్‌లో మోనార్క్ జేఈ



ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు కిందిస్థాయి అధికారులు పనిచేయడం చూస్తుంటాం.. కానీ ఈ అధికారి ఎవరి మాటా వినడు.. ఎవరినీ లెక్కచేయడు.. ఏమన్నా అంటే ఎమ్మెల్యే మా బంధువు అంటాడు.. పైగా తాను యూనియన్ లీడర్‌నంటూ ఫోజు కొడతాడు.. పంచాయతీరాజ్ శాఖలో ఇంజనీర్‌గా పనిచేసే ఆయన అంటే కాంట్రాక్టర్లకు కూడా హడల్.. పైసలిస్తే తప్ప మెజర్‌మెంట్స్ కూడా ఇవ్వడు..

ఉన్నతాధికారులను సైతం లెక్కచేయని వైనం

ఎక్కడ పనిచేసినా వివాదమే

మామూళ్లు ఇస్తేనే మెజర్‌మెంట్స్

ఎమ్మెల్యే బంధువునంటూ హల్‌చల్

అనంతపురం సిటీ, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): పంచాయతీరాజ్ శాఖలోని ఓ ఇంజనీర్ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నా ఉన్నతాధికారులు పట్టించుకోలేదు. అనంతపురం పీఆర్ సబ్ డివిజన్-2లో పనిచేస్తున్న ఆ జేఈ పనితీరుపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇటీవల జరిగిన బదిలీల్లో ఆ అధికారి ఇక్కడికి వచ్చాడు. రాగానే మోనార్క్‌లా వ్యవహరిస్తున్నాడు. ఉన్నతాధికారులను సైతం లెక్కచేయకుండా ఆ ప్రాంత ప్రజాప్రతినిధి తమ బంధువని, ఈఎన్‌సీ తనకు బాగా పరిచయమని, సుదీర్ఘకాలం యూనియన్ లీడర్‌గా పనిచేశానంటూ హల్‌చల్ చేస్తున్నాడు. పల్లెపండుగ పనుల్లో సైతం పలువురు కాంట్రాక్టర్లను ఇబ్బందులకు గురిచేస్తున్నట్లు విమర్శలు వస్తున్నాయి. తమకు అనుకూలమైన కాంట్రాక్టర్‌కు పనులు అప్పగించాలని పైరవీలు చేస్తున్నాడని తెలుస్తోంది. గతంలో పెనుకొండ నియోజకర్గంలో పనిచేసినప్పుడు కూడా పెద్దఎత్తున మాముళ్లకు పాల్పడటం.. సకాలంలో పనులు చేయించకపోవడం.. పైసలిస్తే తప్ప మెజర్‌మెంట్స్ చేయకపోవడం వివాదాస్పదమైంది. దీంతో ఆ ప్రాంత ప్రజాప్రతినిధి అక్కడి నుంచి బదిలీ చేయించారు. తర్వాత క్యూసీ విభాగానికి బదిలీ చేయగా రిపోర్ట్ కోసం వచ్చే కాంట్రాక్టర్లను సైతం పలు రకాలుగా ఇబ్బందులకు గురిచేశాడనే ఆరోపణలు ఉన్నాయి. తోటి ఉద్యోగులతోనూ ఆయనకు విభేదాలు ఉన్నాయి. క్యూసీ నుంచి ఇటీవలే అనంతపురం పీఆర్ డివిజన్-2కి బదిలీ అయ్యారు. మళ్లీ అదే పంథాతో వ్యవహరిస్తున్నాడు.



అనంతపురం పీఆర్‌ఐ సబ్ డివిజన్-2 కార్యాలయం

మామూళ్లు ఇస్తేనే మెజర్‌మెంట్స్

కాంట్రాక్టర్ ప్రభుత్వ పనులు చేస్తే.. సదరు జేఈ దగ్గరుండి వాటిని పర్యవేక్షిస్తూ నాణ్యతతో పాటు కొలతలు పరిశీలించాల్సి ఉంటుంది. పని చేసిన తరువాత మెజర్‌మెంట్స్ తీసి బిల్లులు రికార్డు చేసి డీఈఈతో పాటు ఈఈకి సమర్పించాల్సి ఉంటుంది. ఇక్కడే అసలు కథ మొదలవుతుంది. కాంట్రాక్టర్ ఆయన వద్దకు వెళ్తే కాలయాపన చేస్తాడు. ముందుగానే పైసలిస్తే తప్ప మెజర్‌మెంట్స్ తీయడు, బిల్లు పెట్టడు.

ఎమ్మెల్యే బంధువునంటూ హల్‌చల్

బదిలీపై ఇక్కడికి రాగానే ఆయన తనదైన శైలిలో పైరవీలు మొదలుపెట్టాడు. ఇక్కడి డీఈఈపై కూడా అటు శాఖ పరంగా.. ఇటు స్థానిక ప్రజాప్రతినిధికి ఫిర్యాదులు చేసినట్లు తెలిసింది. ప్రధానంగా సంబంధిత ఎమ్మెల్యే తమ బంధువు అని, తాను చెప్పిందే జరుగుతుందని హల్‌చల్ చేస్తున్నాడని ఆ సబ్ డివిజన్‌తో పాటు ఈఈ కార్యాలయంలోను జోరుగా చర్చ జరుగుతోంది. శింగనమల నియోజకవర్గానికి పల్లె పండుగ కింద రూ. 18.02 కోట్లు నిధులు మంజూరయ్యాయి. ఈ నిధులతో చేపట్టే పనులు తమ వర్గానికి చెందిన కాంట్రాక్టర్‌కు అప్పగించాలనే యోచనతో పైరవీలు చేస్తున్నట్లు తెలుస్తోంది. కాంట్రాక్టర్లను కూడా బెదిరిస్తున్నట్లు విమర్శలు ఉన్నాయి. ఎమ్మెల్యే తమ బంధువు అని చెబుతుడడంతో కాంట్రాక్టర్లలోనూ ఆందోళన నెలకొంది. దీనివల్ల పల్లె పండుగ పనులు ఆశించిన స్థాయిలో జరగడం లేదని సమాచారం.

ఫిర్యాదులు మా వరకు రాలేదు

జేఈ, ఆపై స్థాయి అధికారికి సంబంధించిన అంశాలపై మాకు ఫిర్యాదులు అందలేదు. గతంలో ఆరోపణలు ఉన్నట్లు తెలిసింది. ఆయన ఎక్కువ కాలం క్యూసీలో పనిచేశారు. ఫీల్డ్‌లో తక్కువగా చేశారు. జేఈ ఆపై స్థాయి అధికారి మధ్య ఏదైనా సమస్య ఉంటే పరిశీలించి పరిష్కరిస్తాం. ఉద్యోగులందరితో సమన్వయం చేసుకుని పల్లెపండుగ పనులను వేగవంతం చేస్తాం.

- జహీర్ అస్లాం, ఎస్ఈ, పంచాయతీ రాజ్‌శాఖ

ఉచిత న్యాయసేవలు వినియోగించుకోండి



మాట్లాడుతున్న శాశ్వత లోక్ అదాలత్ చైర్మన్

అనంతపురం క్రైం, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): శాశ్వత లోక్ అదాలత్‌లో ఉచిత ప్రజాప్రయోజన న్యాయ సేవలు వినియోగించుకోవాలని శాశ్వత లోక్ అదాలత్ ధర్మాసనం చైర్మన్ శ్రీనివాసరావు అన్నారు. శాశ్వత లోక్ అదాలత్ గురువారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. ఇరుపక్షాల నడుమ రాజీ కుదిరితే ఇరుపక్షాల సమ్మతితో వివాదం పరిష్కారమవుతుందన్నారు. అప్పీల్‌కు ఆస్కారం లేని శాశ్వత పరిష్కారంగా పరిగణించబడుతుందన్నారు. కోర్టు రుసుము చెల్లించాల్సిన అవసరం లేదన్నారు.

చోరీ కేసులో నిందితుడి అరెస్టు



అరెస్టు వివరాలను వెల్లడిస్తున్న సీఐ శ్రీధర్

రామగిరి, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఉన్నతపాఠశాలలో ఇటీవల జరిగిన దొంగతనం కేసులో నిందితుడిని రామగిరి పోలీసులు అరెస్టు చేశారు. అతడి నుంచి స్మార్ట్‌టీవీ, మూడు బస్తాల బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. గురువారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో సీఐ శ్రీధర్, ఎస్ఐ సుధాకర్‌యాదవ్ విలేకరులకు వివరాలు వెల్లడించారు. రామగిరికి చెందిన రమేశ్ ఉన్నతపాఠశాలలో పరీక్షలు జరిగే సమయంలో బెంచీలు సర్దడానికి వెళ్లి అక్కడ ఏమేమి ఉన్నాయో గమనించాడు. ఆదివారం వాచ్‌మన్ లేని సమయంలో పాఠశాలలోని స్మార్ట్ టీవీ, మూడు బస్తాల బియ్యాన్ని ఎత్తుకెళ్లాడు. ఆ బియ్యాన్ని గురువారం అమ్మడానికి వెళ్తుండగా పోలీసులు గమనించి విచారించారు. టీవీ, బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. వీటి విలువ రూ.1.24లక్ష ఉంటుందన్నారు.

పోలీసుల అదుపులో వైసీపీ కార్యకర్త

బెళుగుప్ప, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వంపై అసభ్యకర పోస్టులు పెట్టిన నక్కలపల్లికి చెందిన వైసీపీ సోషల్ మీడియా కార్యకర్త సంజీవరెడ్డిని పుట్టపర్తి పోలీసులు బుధవారం రాత్రి అదుపులోకి తీసుకున్నారు. కారణమేమిటని గ్రామస్థులు ప్రశ్నించగా, సంజీవరెడ్డి పెట్టిన పోస్టులను పోలీసులు చూపించారు. తిరుపతిలో కేసు నమోదు కాగా, దర్యాప్తు కోసం అదుపులోకి తీసుకున్నారని స్థానిక పోలీసులు తెలిపారు.



సంజీవరెడ్డి

పల్లె పండుగ పనులు సంక్రాంతికి పూర్తి చేయాలి

నాణ్యత తప్పనిసరి

ఎంజీఎన్‌ఆర్‌ఈజీఎస్ చీఫ్ ఇంజనీర్ విజయకుమారి



పరిశీలిస్తున్న ఎంజీ ఎన్ఆర్ ఈజీఎస్ చీఫ్ ఇంజనీర్ విజయ కుమారి

అనంతపురం సిటీ, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): పల్లె పండుగ పనుల్లో ఏ మాత్రం అలసత్వం చేయకుండా సంక్రాంతి పండుగలోపు పూర్తి చేయాలని ఎంజీఎన్‌ఆర్‌ఈజీఎస్ చీఫ్ ఇంజనీర్ విజయకుమారి ఆదేశించారు. పంచాయతీ రాజ్‌శాఖ ఎస్ఈ కార్యాలయంలో ఆమె ఉమ్మడి జిల్లాల ఎస్ఈ, ఈఈలు, డీఈఈలు, జేఈఈలతో గురువారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ముందుగా ఆయా జిల్లాల వారిగా పల్లె పండుగ పనుల పనితీరు, లక్ష్యం తదితర అంశాలపై ఆరా తీశారు. పల్లె పండుగ పనుల్లో నాణ్యత ప్రమాణాలను పాటించాలని దిశానిర్దేశం చేశారు. ప్రభుత్వ ఆదేశాలు ప్రకారం ప్రతి ఒక్కరూ లక్ష్యాన్ని పెట్టుకుని బాధ్యతగా పనిచేయాలన్నారు. అనంతరం ఆమె ఎస్ఈ జహీర్‌అస్లాంతో తపోవనంలో నిర్మించిన సిమెంట్ రోడ్డు నాణ్యతను పరిశీలించారు. కార్యక్రమంలో ఎస్ఈ డీపీఆర్‌పీ మురళి, ఈఈలు ప్రభాకర్‌రెడ్డి, మల్లికా ర్జునమూర్తి, డీఎల్ శ్రీనివాసులు, అధికారులు పాల్గొన్నారు.

రెండో దశ క్రికెట్ పోటీలు ప్రారంభం



నాగసాయి చరణ్

అనంతపురం క్లాక్‌టవర్, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): జిల్లా క్రికెట్ సంఘం ఆధ్వర్యంలో గురువారం స్థానిక ఆర్డీటీ స్టేడియంలో రెండో దశ జిల్లా స్థాయి ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ అండర్-16 క్రికెట్ పోటీలు ప్రారంభమయ్యాయి. ఏసీఏ సీ-ఏసీఏ ఏ జట్ల మధ్య పోటీ జరగగా మొదట బ్యాటింగ్ చేసిన ఏసీఏ-సీ జట్టు 50 ఓవర్లలో 120 పరుగులకు ఆలౌట్ అయ్యింది. ఏసీఏ-ఏ జట్టు బౌలర్లు ప్రకాష్, హేమచంద్ర చెరో మూడు వికెట్లు తీశారు. మొదటి రోజు ఆట ముగిసే సమయానికి మొదటి ఇన్నింగ్స్ ప్రారంభించిన ఏసీఏ-ఏ జట్టు 27 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి 104 పరుగులు చేసింది. ఇందులో ఓంకార్ 60 పరుగులు చేశాడు. ఏసీఏ-సీ జట్టు 16 పరుగుల ఆధిక్యంలో ఉంది. మరో మ్యాచ్‌లో టీం డీ-టీం బీ జట్ల మధ్య తలపడగా మొదట బ్యాటింగ్ చేసిన టీం-బీ జట్టు 90 ఓవర్లలో 9 వికెట్లు కోల్పోయి 254 పరుగులు చేసింది. ఇందులో నాగసాయి చరణ్ 84 పరుగులు చేశాడు. కార్యక్రమంలో జిల్లా క్రికెట్ సంఘం అధ్యక్షుడు పీఎల్ ప్రకాష్‌రెడ్డి, ఇన్‌చార్జి సెక్రటరీ భీమలింగారెడ్డి, ఏసీఏ సెలెక్షన్ కమిటీ చైర్మన్ విజయ్‌కుమార్, సెలెక్టర్లు కోటా రెడ్డి, నాగార్జున తదితరులు పాల్గొన్నారు.

ఖనిజం టిప్పర్ సీజ్



డి.హీరేహాళ్, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): ఓఎంసీ ప్రాంతం నుంచి అక్రమంగా ఇనుప ఖనిజాన్ని తరలిస్తున్న టిప్పర్‌ను పోలీసులు సీజ్ చేశారు. బళ్లారికి చెందిన టిప్పర్ యజమాని తిమ్మారెడ్డి, ఓబులాపురం వైసీపీ నాయకులు పంపాపతి, శంకరప్ప ఓఎంసీ నుంచి ఖనిజాన్ని తరలించబోయారని ఎస్ఐ గురుప్రసాద్ రెడ్డి తెలిపారు. తమ సిబ్బందితో బుధవారం రాత్రి అక్కడికి వెళ్లి వారిని అరెస్టు చేశామని తెలిపారు. ముగ్గురు నిందితులు, టిప్పర్‌ను మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. దీన్నుంచి బయట పడేందుకు వైసీపీ నాయకులు పోలీసులపై ఒత్తిడి తెస్తున్నారని తెలిసింది.

అత్యవసర ఆందోళన..!

(5వ పేజీ తరువాయి)

అలాంటిది వినాయకచవితి, దసరా, దీపావళి పండుగల సమయంలో కూడా వేతనాలు అందలేదని వాపోతున్నారు. కుటుంబ పోషణకు అప్పులు చేస్తున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

వందలాది మంది..

ఉమ్మడి జిల్లాలో 104 వాహనాలు 36 వరకు, 108 వాహనాలు 66 వరకూ ఉన్నాయి. ఒక్కో వాహనానికి ఒక డ్రైవర్, ఒక డీఈఓ ఉన్నారు. 104 వాహనంలో సీనియర్ డ్రైవర్‌కు రూ.24 వేలు, జూనియర్ డ్రైవర్‌కు రూ.16 వేలు వేతనం ఇస్తున్నారు. డేటా ఎంట్రీ ఆపరేటర్‌కు రూ.12 వేలు ఇస్తున్నారు. 108 వాహన డ్రైవర్‌కు రూ.16 వేల నుంచి రూ.26 వేల వరకు వేతనం ఇస్తున్నారు. రిలీవర్లతో కలుపుకుని ఈ రెండు వ్యవస్థల్లో 400 మంది వరకు సిబ్బంది ఉన్నారు. మూడునెలల నుంచి వేతనాలు అందకపోవడంతో కలెక్టర్, డీఎంహెచ్ఓ తదితర ఉన్నతాధికారులను కలిసి వినతి పత్రాలను సమర్పిస్తున్నారు. కానీ స్పందన లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



అరిగిపోయిన 104 వాహనంటైర్లు

తప్పుకున్న అరబిందో

వైసీపీ ప్రభుత్వ హయాంలో 108, 104 వాహనాల నిర్వహణ బాధ్యతలను అరబిందో సంస్థ చూసేది. ఆ సంస్థపై ఆది నుంచి అనేక ఆరోపణలు వచ్చాయి. టీడీపీ కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తరువాత వారి అక్రమాలపై ప్రత్యేక దృష్టిపెట్టింది. ఒక్కొక్కటి బయటకు తీస్తోంది. దీంతో కాంట్రాక్టు గడువు ఉండగానే.. నిర్వహణ బాధ్యతల నుంచి అరబిందో తప్పుకుంది. కూటమి ప్రభుత్వం ఆమోదించింది. దీంతో 108, 104 సిబ్బందిలో ఆందోళన మొదలైంది. బకాయి వేతనాలను అరబిందో ఇస్తుందా, రాష్ట్ర ప్రభుత్వం చెల్లిస్తుందా తెలియడం లేదని బాధితులు వాపోతున్నారు. నెలనెలా వేతనాలను ఇవ్వకుండా అరబిందో సంస్థ తమను ఇబ్బంది పెట్టిందని, ఇప్పుడు తమను నట్టేట వదిలేసి వెళ్లిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం నుంచి బిల్లులు వస్తేనే వేతనాలు ఇస్తామని ఆ సంస్థ అంటోందని వాపోతున్నారు. అరబిందో స్థానంలో నిర్వహణ బాధ్యతలను మరొకరికి అప్పగించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. దీంతో వేతన బకాయిలపై స్పష్టత ఇవ్వాలని, తమను ఆదుకోవాలని బాధితులు కోరుతున్నారు.



వేతనాలు ఇప్పించండి అంటూ డీఎంహెచ్ఓకు వినతి పత్రం అందజేస్తున్న 104సిబ్బంది

అరకొర వేతనాలు..

శ్రీసత్యసాయి జిల్లాలో 104 వాహనాల్లో 74 మంది పనిచేస్తున్నారు. వీరిలో పైలెట్‌లు (డ్రైవర్లు) 35 మంది, డేటా ఎంట్రీ ఆపరేటర్లు 35 మంది, అదనపు సిబ్బంది నలుగురు ఉన్నారు. ఒక్కో 104 వాహనంలో ఇద్దరు పనిచేస్తున్నారు. నెలలో 26 రోజులు గ్రామాలకు వెళ్లి వైద్య సేవలు అందిస్తున్నారు. కానీ పనికి తగ్గ వేతనం అందడం లేదు. పైలెట్లకు రూ.12,900, డేటా ఎంట్రీ ఆపరేటర్లకు రూ.12,500 చెల్లిస్తున్నారు. స్లాబ్ ప్రకారం 2016 నుంచి పనిచేస్తున్న పైలెట్‌లకు రూ.22 వేలు వేతనం ఇవ్వాలి. కానీ పాత వేతనంతోనే సరిపెడుతున్నారు. జీఓ నంబర్ 7 ప్రకారం ఐదేళ్లగా పనిచేస్తున్న ప్రతి ఔట్‌సోర్సింగ్ ఉద్యోగికి రూ.18,500 వేతనం ఇవ్వాలి. అమలు కావడం లేదు. 104 వాహనాల నిర్వహణ కూడా గాడి తప్పింది. టైర్లు అరిగిపోయినా పట్టించుకోలేదని, డీజిల్ సమస్యతో ఇబ్బంది పడుతున్నామని సిబ్బంది అంటున్నారు.

ప్రభుత్వం దృష్టికి తీసుకువెళతాం..

108, 104 సిబ్బందికి వేతనాలు అందడం లేదని మాదృష్టికి వచ్చింది. వారికి జీతాలు ఇచ్చే బాధ్యత నిర్వహణ సంస్థదే. వైద్యశాఖ పరిధిలో ఉండదు. సమస్యను కలెక్టరు ద్వారా ప్రభుత్వం దృష్టికి తీసుకువెళతాం.

- డాక్టర్ ఈబీ దేవి, అనంతపురం డీఎంహెచ్ఓ

అప్పులు చేసి బతుకుతున్నాం..



మూడు నెలలుగా జీతాలు ఇవ్వడం లేదు. వినాయకచవితి, దసరా, దీపావళి పండుగల సమయంలోలైనా ఇస్తారని అనుకున్నాం. కానీ ఇవ్వలేదు. వడ్డీలకు అప్పులు తెచ్చి కుటుంబాలను సాకుతున్నాం. ఇప్పుడు అరబిందో సంస్థ తప్పుకుందని అంటున్నారు. మాకు బకాయి జీతాలు ఎవరిస్తారో అర్థంకావడం లేదు. ప్రభుత్వం మమ్మల్ని ఆదుకోవాలి.

- సుబ్రమణ్యం, 104 ఉద్యోగుల సంఘం శ్రీసత్యసాయి జిల్లా ప్రధాన కార్యదర్శి

సమాన వేతనం ఇవ్వాలి..



రెండున్నరేళ్ల నుంచి డేటా ఎంట్రీ ఆపరేటర్‌గా పనిచేస్తున్నాను. పనికి తగ్గ వేతనం ఇవ్వడం లేదు. చాలీచాలని వేతనాలతో ఇబ్బందులు పడుతున్నాం. సుప్రీం కోర్టు గైడ్‌లైన్స్ ప్రకారం సమాన పనికి సమావేతనం ఇవ్వాలి. అదే మా డిమాండ్.

- సాయికుమార్, డేటా ఎంట్రీ ఆపరేటర్, సీకేపల్లి

పీహెచ్‌సీలకు అటాచ్ చేయాలి..



104 వాహనాల నిర్వహణను పీహెచ్‌సీలకు అటాచ్ చేయాలి. దీనివల్ల ఖర్చు తగ్గుతుంది. కాంట్రాక్టు ఇస్తే ఖర్చు ఎక్కువ అవుతుంది. ప్రజాధనం దుర్వినియోగం అవుతుంది. బకాయి వేతనాలను చెల్లించి మాకు న్యాయం చేయాలి.

- మోహన్‌బాబు, 104 ఉద్యోగుల సంఘం శ్రీసత్యసాయి జిల్లా ప్రధానకార్యదర్శి

ప్రశాంతి జిల్లా సమాఖ్య కార్యవర్గం ఎన్నిక



ప్రశాంతి జిల్లా సమాఖ్య నూతన కార్యవర్గ సభ్యులు

అనంతపురం క్లాక్‌టవర్, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): ప్రశాంతి జిల్లా సమాఖ్య నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. గురువారం స్థానిక బుడ్డప్పనగర్‌లో ఉన్న ప్రశాంతి జిల్లా సమాఖ్య కార్యాలయంలో జిల్లా నూతన కార్యవర్గం ఎన్నికలు నిర్వహించారు. చిత్తూరు జిల్లా సమాఖ్య అధ్యక్షురాలు సుకన్య పర్యవేక్షణలో ఎన్నికలు జరిగాయి. అధ్యక్షురాలు పదవికి ఐదుగురు పోటీ పడగా సుశీల (రాప్తాడు-ఓసీ) 12 ఓట్లతో ఎన్నికయ్యారు. కార్యదర్శిగా ఇ.రాధమ్మ (కంబదూరు-ఎస్సీ) ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఉపాధ్యక్ష పదవికి ఐదుగురు పోటీ పడగా రామలక్ష్మి (శెట్టూరు-ఎస్సీ) 11 ఓట్లతో ఎన్నికయ్యారు. కోశాధికారిగా నలుగురు పోటీలో నిలవగా భాగ్యలక్ష్మి (బెళుగుప్ప-బీసీ) 12 ఓట్లతో గెలుపొందారు. సహాయ కార్యదర్శి పదవికి నలుగురు పోటీ పడగా ఎస్. పర్వీన్ (బీసీ) 14 ఓట్లతో ఎన్నికయ్యారు. ఏడాది పాటు సాగే ఈ కమిటీ జిల్లాలోని డ్వాక్రా సంఘాల మహిళల అభివృద్ధికి పని చేస్తుంది. ఇదివరకు ప్రశాంతి జిల్లా సమాఖ్య అధ్యక్ష, కార్యదర్శులు షేకున్‌బీ, రాధమ్మ, ఉపాధ్యక్షురాలు సుజాత, సహాయ కార్యదర్శి సుహాసిని, కోశాధికారి లలితను సన్మానించారు.

ఆవిష్కరణలతోనే భవిష్యత్తు

జేఎన్‌టీయూ రిజిస్ట్రార్ కృష్ణయ్య



శిక్షణ పొందిన అధ్యాపకులతో రిజిస్ట్రార్ కృష్ణయ్య

అనంతపురం సెంట్రల్, నవబంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఆవిష్కరణలపై దృష్టి పెట్టినప్పుడే విద్యార్థులు భవిష్యత్తులో శాస్త్రవేత్తలుగా రాణిస్తారని జేఎన్‌టీయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ కృష్ణయ్య పేర్కొన్నారు. జేఎన్‌టీయూ ఇంజనీరింగ్ కళాశాల కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్ విభాగంలో 'ఆధునిక కంప్యూటింగ్' అనే అంశంపై మూడురోజుల పాటు నిర్వహించిన సదస్సు గురువారం ముగిసింది. ప్రిన్సిపాల్ చెన్నారెడ్డి అధ్యక్షతన నిర్వహించిన సదస్సుకు ముఖ్య అతిథిగా హాజరైన రిజిస్ట్రార్ మాట్లాడుతూ విద్యార్థులకు నూతన సాంకేతిక పరిజ్ఞానం అందించేలా అధ్యాపకులకు మూడు రోజుల పాటు శిక్షణ ఇవ్వడం అభినందనీయమన్నారు. అనంతరం అధ్యాపకులకు సర్టిఫికెట్లను అందజేశారు. కార్యక్రమంలో కోఆర్డినేటర్లు ప్రొఫెసర్ ఎ.పి. శివకుమార్, ఆర్.రాజశేఖర్, వైస్ ప్రిన్సిపాల్ వసుంధర, పరిశోధకులు ఉమామహేశ్వరరావు, రహ్మానుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

స్క్రీనింగ్‌తోనే క్యాన్సర్ నివారణ

డీఎంహెచ్ఓ డాక్టర్ ఈబీ దేవి.. వైద్యశాఖ ఆధ్వర్యంలో ర్యాలీ



క్యాన్సర్‌పై అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న డీఎంహెచ్ఓ, వైద్యులు, సిబ్బంది

అనంతపురం టౌన్, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): ప్రస్తుతం ప్రజలను పీడిస్తున్న క్యాన్సర్ నివారణ కేవలం స్క్రీనింగ్‌తోనే సాధ్యమవుతుందని డీఎంహెచ్ఓ డాక్టర్ ఈబీ దేవి తెలిపారు. జాతీయ క్యాన్సర్ అవగాహన దినం సందర్భంగా గురువారం వైద్యశాఖ ఆధ్వర్యంలో అనంతపురంలో అవగాహన ర్యాలీ చేపట్టారు. డీఎంహెచ్ఓ కార్యాలయం వద్ద ఈబీ దేవి జెండాను ఊపి ర్యాలీని ప్రారంభించారు. అక్కడి నుంచి నినాదాలు చేసుకుంటూ సప్తగిరి సర్కిల్ వరకుర్యాలీ కొనసాగించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్ఓ మాట్లాడుతూ క్యాన్సర్లు వివిధ రకాలుగా వ్యాపిస్తాయన్నారు. ప్రధానంగా రొమ్ము క్యాన్సర్, గర్భాశయ, ముఖద్వార, నోటి క్యాన్సర్లు అత్యధికంగా వ్యాపిస్తున్నాయన్నారు. వీటిని ప్రాథమిక దశలోనే గుర్తించి తగిన చికిత్సలు తీసుకుంటే నయమవుతాయన్నారు. ప్రభుత్వం కూడా ప్రతి ఒక్కరికి స్క్రీనింగ్ పరీక్షలు చేయించాలని నిర్ణయం తీసుకుందన్నారు. ఈనెల14 నుంచి వైద్య సిబ్బంది ప్రతి ఇంటికి వచ్చి స్క్రీనింగ్ పరీక్షలు చేస్తారని తెలిపారు. సుమారు 8నెలల పాటు ఈ ప్రక్రియ కొనసాగుతుందని, ప్రతి మహిళ తప్పనిసరిగా స్క్రీనింగ్ చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డాక్టర్లు సుజాత, ఓబులు, మధుసూదన్, నిహారిక, ప్రశాంతి, నారాయణస్వామి, సుమన, సునీల్, శ్రీహర్ష, రాజేష్, మనీషా, గీతాంజలి, డెమోలు త్యాగరాజు, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

పీఈటీ, క్రీడాకారిణి మృతి బాధాకరం : శాప్ చైర్మన్

అనంతపురం క్లాక్‌టవర్, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో పీఈటీ రమేష్, అతడి కుమార్తె హాకీ క్రీడాకారిణి సాయిభవిత మృతి చెందడం అత్యంత బాధాకరమని ఏపీ రాష్ట్ర క్రీడాభివృద్ధి సంస్థ (శాప్) చైర్మన్ అనిమిని రవినాయుడు తెలిపారు. ఈమేరకు గురువారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. ఒకే కుటుంబంలో క్రీడారంగానికి చెందిన ఇద్దరి మరణం తనను తీవ్రంగా కలచివేసిందని పేర్కొన్నారు. బాధిత కుటుంబానికి ప్రగాఢ సానుభూతి ప్రకటించారు. ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.

నేటి నుంచి చిన్నపిల్లల వైద్యుల సదస్సు

అనంతపురం టౌన్, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): చిన్న పిల్లల వైద్యుల రాష్ట్ర సదస్సు శుక్రవారం నుంచి అనంతపురంలో మూడు రోజుల పాటు నిర్వహించనున్నట్లు డాక్టర్లు శ్రీకాంత్, పవన్, సుదీప్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తొలిరోజు జిల్లా ఆసుపత్రి, వైద్య కళాశాల, ఐఎంఏ హాల్, కేర్‌అండ్‌క్యూర్, సవేరా ఆసుపత్రులలో వర్క్‌షాపులు జరుగుతాయన్నారు. శని, ఆదివారాల్లో గుత్తిరోడ్డులోని శ్రీసెవెన్ కల్యాణ మండపంలో సదస్సులు ఉంటాయన్నారు. ఈ సదస్సుకు చెన్నైకు చెందిన డాక్టర్ తంగవేలు, హైదరాబాద్‌కు చెందిన డాక్టర్ శ్రీనివాసమూర్తి, బెంగళూరుకు చెందిన డాక్టర్లు అక్షయ్‌శెట్టి, ప్రతాప్‌చంద్ర హాజరవుతారని పేర్కొన్నారు. చిన్నపిల్లల వైద్య రంగంలో కొత్త సాంకేతిక విధానాల గురించి చర్చిస్తామని వెల్లడించారు.





అలంకరణలో సుబ్రహ్మణేశ్వర స్వామి, కల్యాణోత్సవం జరిపిస్తున్న అర్చకులు

ఘనంగా సుబ్రహ్మణేశ్వర స్వామి కల్యాణం

ఆత్మకూరు, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): పంపనూరు సుబ్రహ్మణేశ్వర స్వామి కల్యాణోత్సవాన్ని గురువారం రాత్రి ఘనంగా నిర్వహించారు. వల్లి, దేవసేన సమేత స్వామివారికి అర్చకులు ఘనంగా కల్యాణం నిర్వహించారు. ఉదయం స్వామి వారికి క్షీరాభిషేకం, పంచామృతాభిషేకం, ఆకుపూజ, అర్చన నిర్వహించారు. కార్యక్రమంలో ఈఓ బాబు భక్తులు పాల్గొన్నారు.

రోస్టర్ తారుమారు

పీజీటీ కెమిస్ట్రీ బాధితుల గగ్గోలు

అనంతపురం విద్య, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): కేజీబీవీ పోస్టుల భర్తీలో రోస్టర్‌ను తారుమారు చేసి అర్హులకు అన్యాయం చేస్తున్నారంటూ బాధితులు వాపోతున్నారు. నోటిఫికేషన్ ఇచ్చినప్పుడు ఒక రోస్టర్ చూపించి, పోస్టుల భర్తీ సమయంలో పాత రోస్టర్ అమలు చేస్తున్నారంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా పీజీటీ కెమిస్ట్రీ సబ్జెక్టుకు సంబంధించి నాలుగు పోస్టులుంటే నోటిఫికేషన్‌లో ఓసీ 2, ఎస్సీ, బీసీ-ఏ, రోస్టర్లను చూపారు. పోస్టుల భర్తీ సమయంలో అసలు బీసీ-ఏ రోస్టర్ లేదంటూ ఆ కేటగిరీ అభ్యర్థులు వాపోతున్నారు. ఇతర కేటగిరీల అభ్యర్థులకు సైతం అన్యాయం చేస్తున్నారన్న విమర్శలు వస్తున్నాయి. దీనిపై ఏపీసీ నాగరాజును వివరణ కోరగా... ఎస్పీడీ నుంచి వచ్చిన జాబితాల మేరకు అర్హుల సర్టిఫికెట్ల వెరిఫికేషన్ నిర్వహించామని, పారదర్శకంగా పోస్టులను భర్తీ చేస్తున్నట్లు తెలిపారు.

61 మందికి అంగన్‌వాడీ నియామక ఉత్తర్వులు

అనంతపురం విద్య, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖలో 61 మంది అభ్యర్థులకు అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్ల నియామక ఉత్తర్వులిచ్చినట్టు ఐసీడీఎస్ పీడీ శ్రీదేవి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అంగన్‌వాడీ వర్కర్ పోస్టులు తొమ్మిదింటిలో నలుగురికి, మినీ అంగన్‌వాడీ వర్కర్ పోస్టులు నాలుగు ఉండగా ఇద్దరికి, హెల్పర్ పోస్టులు 71 ఉండగా 54 మందిని ఎంపిక చేసినట్టు తెలిపారు. అన్ని ప్రాజెక్టుల్లోని సీడీపీఓలు అభ్యర్థులకు నియామక ఉత్తర్వులు అందజేశారని పీడీ పేర్కొన్నారు.

నేటి ప్రముఖులు

పోర్ట్రెయిట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కాంప్...

ద్వారం వెంకటస్వామి నాయుడు (జయంతి)



వయొలిన్ విద్వాంసుడు, 'పద్మశ్రీ' గ్రహీత ద్వారం వెంకట స్వామి నాయుడు 1893 నవంబరు 8న బెంగళూరులో జన్మించారు. 26ఏళ్లకే విజయ నగరం మహారాజా సంగీత కళాశాలలో వయొలిన్ ఆచార్యునిగా నియమితులై అనతికాలంలోనే ప్రిన్సిపాల్ అయ్యారు. సారంగిపై కర్ణాటక సంగీతం వినిపించిన తొలివ్యక్తి బహుశా ఆయనే కావచ్చు. సంగీతంపై ఎన్నో వ్యాసాలు రాశారు. సంగీత కళానిధి, సంగీత నాటక అకాడమీ, రాజాలక్ష్మీ అవార్డు తదితర పురస్కారాలు పొందారు. 1964 నవంబరు 25న కన్నుమూశారు. 1993లో ఆయన శతజయంతి సందర్భంగా ప్రత్యేక పోస్టల్ స్టాంప్ విడుదల చేశారు.

సితారా దేవి (జయంతి)



'పద్మశ్రీ' పురస్కార గ్రహీత సితారాదేవి 1920 నవంబరు 8న కోల్కత్తాలో జన్మించారు. 'కథక్' శాస్త్రీయ నృత్యకారిణి, గాయని, నటిగా పేరొందారు. 16 ఏళ్లకే 'నృత్య సామ్రాజ్ఞి'గా రవీంద్రనాథ్ ఠాగూర్‌చే ప్రశంస లు పొందారు. సంగీత నాటక అకాడమీ, కాళిదాస్ సమ్మాన్ తదితర పురస్కారాలు పొందారు. బాలీవుడ్ ప్రముఖులకు సైతం కథక్ గురించి బోధించారు. 'కథక్ క్వీన్'గా నేటికీ అభి మానులచే పిలువబడుతున్నారు. 2014 నవంబరు 25న కన్నుమూశారు.

ఎల్‌కే అడ్వాణి (పుట్టినరోజు)



దేశ అత్యున్నతమైన 'భారతరత్న' గ్రహీత లాల్‌కృష్ణ అడ్వాణి 1927 నవంబరు 8న కరాచీలో జన్మించారు. 2002-04 మధ్యన ప్రధాని వాజ్‌పేయ్ హయాంలో 7వ ఉప ప్రధానిగా, కేంద్ర హోం మంత్రిగా వ్యవహరించారు. రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్‌లో వలంటీర్ నుంచి బీజేపీ సహసంస్థాపకులలో ఒకరిగా, జాతీయ రాజకీయ నేతగా ఎదిగారు. ఆయన రాసిన 'మై కంట్రీ మై లైఫ్' ఆటోబయోగ్రఫీ నాన్‌ఫిక్షన్ కేటగిరీలో బెస్ట్ సెల్లర్‌గా నిలిచింది. పద్మవిభూషణ్ పురస్కారం అందుకున్నారు.

కజువో ఇషిగురో (పుట్టినరోజు)



నోబెల్ పురస్కార గ్రహీత 'సర్' కజువో ఇషిగురో 1954 నవంబరు 8న జపాన్ దేశం నాగసాకిలో జన్మించారు. ఆంగ్ల నవలా రచయిత, స్క్రీన్ రైటర్‌గా, చిన్న కథల రచ యితగా పేరొందారు. ఫిక్షన్ రైటర్స్‌లో తనదైన గుర్తింపు పొందారు. 2017లో స్వీడిష్ అకాడమీచే సాహిత్యంలో 'నోబెల్ ప్రైజ్' పొందారు. 'ద రిమైన్స్ ఆఫ్ ది డే' నవలకు 'బుకర్ ప్రైజ్' లభించింది. 'నెవర్ లెట్ మి గో' నవలకు ప్రాచుర్యం లభించింది. అమెరికన్ అకా డమీ ఆఫ్ అచీవ్‌మెంట్స్ గోల్డెన్‌ప్లేట్ అవార్డు, ఇతర పుర స్కారాలు పొందారు. 'లివింగ్' సినిమాకు స్క్రీన్‌ప్లే రాయగా 2023 అకాడమీ అవార్డ్‌కు నామినేట్ అ య్యింది. ఆఫీసర్ ఆఫ్ ది ఆర్డర్ ఆఫ్ ది బ్రిటీష్ ఎంపైర్ గుర్తింపు పొందారు.

బ్రెట్ లీ (పుట్టినరోజు)



ఆస్ట్రేలియా దేశానికి చెందిన అంతర్జాతీయ క్రికెట్ క్రీడాకారుడు బ్రెట్ లీ 1976 నవంబరు 8న జన్మించారు. జట్టు తరపున 2003 వరల్డ్ కప్ దక్కించుకోవడంలో కీలకంగా వ్యవహరించారు. తన కెరీర్‌లో 'ప్రపంచంలో ఫాస్టెస్ట్ బౌలర్స్'లో ఒకరిగా పేరొందారు. ట్వంటీ 20 ఇంటర్నేషనల్ క్రికెట్‌లో హ్యాట్రిక్ సాధించారు. వన్డే లలో 100 వికెట్లు వేగంగా సాధించిన రెండో ఆస్ట్రేలియన్ క్రికెటర్‌గా నిలిచారు. రిటైరయ్యాక నటుడిగా, ఫాక్స్ స్పోర్ట్స్ కామెంటేటర్‌గా కొనసాగుతు న్నారు. సామాజిక సేవలు సైతం అందిస్తున్నారు.

సాంస్కృతిక కళాజాతాకు శ్రీకారం

» 21, 22 తేదీలలో జిల్లా సమ్మేళనం

బాగేపల్లి, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): దేశంలో శ్రామిక, దళితులు, రైతులు, మైనారిటీలు అస్పృశ్యులు ఇతర కార్మికవర్గాలు ఒక్కటవ్వాలని అప్పుడే పెట్టుబడిదారుల పెత్తనానికి దీటైన సమాధానం సాధ్యమని సీపీఎం జిల్లా కార్యదర్శిముని వెంకటప్ప అభిప్రాయపడ్డారు. ఈనెల 21, 22లో కొండంవారిపల్లిలోని ఎస్‌ఎల్‌ఎన్ కల్యాణమండపంలో చిక్కబళ్లాపుర జిల్లా సాంస్కృతిక కళాజాథా జరగనుంది. ఇందుకు సన్నాహకంగా తాలూకాలోని అన్ని గ్రామాలలో చైతన్యం కల్పించేలా జాథా వాహనానికి శ్రీకారం చుట్టారు. గురువారం ఏర్పాటైన కళాజాథాలో ఆయన మాట్లాడుతూ వెనుకబడినవర్గాలలో చైతన్యం కల్పించడమే లక్ష్యమన్నారు. సీపీఎం నాయకుడు డాక్టర్ అనిల్‌కుమార్ ఆవులప్ప మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం సామాన్యుల సంక్షేమాన్ని విస్మరించిందని మండిపడ్డారు. ప్రతి ఐదేళ్లకోసారి జిల్లాస్థాయి సమ్మేళనం నిర్వహించి సామాజిక, ఆర్థికి ప్రగతిపై సమగ్రంగా చర్చలు ఉంటాయన్నారు. ఈ సందర్భంగా కృష్ణప్ప, పిచ్చల్లి శ్రీనివాస్ అశ్వత్థప్ప, ముస్తాఫా తదితరులు పాల్గొన్నారు.



సాంస్కృతిక కళాజాతా వాహనానికి పచ్చజెండా చూపుతున్న నాయకులు

దివ్యాంగ కళాకారులను ప్రోత్సహించాలి

» ప్రముఖ గాయకుడు కునాల్ గాంజావాలా



సమర్థనం ఆర్ట్ సెంటర్ ప్రారంభంలో గాయకుడు కునాల్ గాంజావాలా తదితరులు

బెంగళూరు, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగ కళాకారులను ప్రోత్సహించాలని, ఆ దిశగా సమర్థనం ట్రస్టు నిర్ణయం తీసుకోవడం సంతోషకరమని ప్రముఖ గాయకుడు కునాల్‌గాంజావాలా అభిప్రాయపడ్డారు. సమర్థనం ట్రస్టు ఆధ్వర్యంలో సమర్థనం ఆర్ట్ సెంటర్‌ను గురువారం లాంఛనంగా ప్రారంభించారు. సమర్థనం వ్యవస్థాపకులు డాక్టర్ మహంతేశ్ పర్యవేక్షణలో జరిగిన కార్యక్రమంలో బీఎన్‌పి పరిబాస్ ఇండియా సీఈఓ సంజయ్‌సింగ్, ఎల్ఐసి మేనేజర్ జయశ్రీ బాలకృష్ణన్, జేఎల్‌ఎల్ ఇండియా సీఎఫ్‌ఓ అవీక్ సిన్హా, థర్మో ఫ్రైజర్ సైంటిఫిక్ ఫైనాన్స్ అధికారి నాగభూషణరెడ్డి ముఖ్యులుగా పాల్గొన్నారు. మహంతేశ్ మాట్లాడుతూ 32వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో కళాకేంద్రాన్ని పూర్తిస్థాయి సౌలభ్యాలతో ఏర్పాటు చేశా మన్నారు. దివ్యాంగ కళాకారులను ప్రోత్సహించడమే ఆశయమన్నారు. ఆడిటోరియం, ప్రత్యేకమైన లిఫ్టులు, శిక్షణకు అనుగుణమైన సౌలభ్యాలు, మ్యూజిక్ పెర్ఫార్మింగ్ ఆర్ట్స్ సెంటర్‌తోపాటు చికిత్సలకోసం ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేశా మన్నారు. దివ్యాంగ కళాకారులకు శిక్షణతోపాటు కార్యక్రమాలు నిర్వహించే వెసలుబాటు ఉంటుందన్నారు.

టెక్‌పార్క్‌లో టీడీపీ సభ్యత్వ నమోదు

బెంగళూరు, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): నగరంలోని హెబ్బాళ పరిధిలోని మాన్యతా టెక్‌పార్క్, హెగ్డే నగర్ ప్రాంతాలలో తెలుగుదేశం పార్టీ సభ్యత్వ నమోదు కొనసాగిస్తున్నట్టు ఏపీ ఖాదీ బోర్డు మాజీ డైరెక్టర్ పాపణ్ణ తెలిపారు. బెంగళూరు టీడీపీ ఫోరం కార్యదర్శి శ్రీకాంత్, చన్నకేశకేశవులు, పురుషోత్తమ, రెడ్డెప్పరెడ్డిలతోపాటు పలువురు పాల్గొన్నారన్నారు. వంద రూపాయలు చెల్లించి సభ్యత్వ నమోదు తీసుకుంటే రూ.5లక్షల వరకు ప్రమాద బీమా సదుపాయం ఉంటుందని పాపణ్ణ తెలిపారు. ఆంధ్రలో ఓటు హక్కు కల్గిన వలస కార్మికులైతే సభ్యత్వం తీసుకోవచ్చునన్నారు. పార్టీ పట్ల అభిమానం కల్గినవారు వంద రూపాయలు చెల్లించ లేకపోతే తామే భరిస్తామని పాపణ్ణ తెలిపారు. పార్టీ అభిమానులు వెంకటరమణా రెడ్డి, ఉత్తన్న, ఎల్లప్ప, నాగార్జున, శ్రీనివాసులురెడ్డి, శేఖర్‌రెడ్డితోపాటు పలువురు పాల్గొన్నారు.



సభ్యత్వ నమోదులో పాపణ్ణ తదితరులు

క్లైమేట్ టెక్నాలజీలో 400 కోట్ల పెట్టుబడికి మిత్సుబిషి

బెంగళూరు, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఎలక్ట్రికల్ ఉత్పత్తులలో పేరొందిన మిత్సుబిషి క్లైమేట్ టెక్నాలజీకి అనుగుణంగా బెంగళూరులో అత్యాధునిక ప్లాంట్ ఏర్పాటుకు రూ.400 కోట్ల పెట్టుబడి పెట్టనున్నట్టు ప్రకటించింది. సంస్థ సీఈఓ అనిల్‌దేవ్ గురువారం బెంగళూరులో మీడియాతో మాట్లాడుతూ నగరానికి 50 కిలోమీటర్ల దూరంలో కోలారు జిల్లా నరసాపురలో అత్యాధునిక ప్లాంట్‌ను ఏర్పాటు చేస్తున్నామన్నారు. శీతల పరికరాలు, డేటా సెంటర్ కూలింగ్ సిస్టమ్ విభాగాలను తయారు చేయదలిచామన్నారు. ఏసీ యూనిట్‌లు, హీట్ పంప్‌లు, ఎయిర్ కండీషనర్ పరికరాలు తయారు చేయదలిచామన్నారు. 400 కోట్ల పెట్టుబడి ద్వారా ఉపాధి, ఉద్యోగ అవకాశాలు స్థానికుల సాధ్యమన్నారు.



సీఈఓ అనిల్‌దేవ్

అతి చిన్న ఇంప్లాంట్‌తో మోకాలికి శస్త్ర చికిత్స

బెంగళూరు, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): ఆస్టియో ఆర్థరైటిస్‌తోపాటు దివ్యాంగులైన వ్యక్తికి నారాయణ హెల్త్ సిటీలో అతి చిన్న ఇంప్లాంట్‌తో సంపూర్ణంగా మోకాలికి శస్త్ర చికిత్సలు విజయ వంతం చేశారు. గురువారం వైద్యనిపుణులు ప్రశాంత్, అభినందన్‌లు మాట్లాడుతూ కలబురగికి చెందిన 58ఏళ్ల రవీంద్ర ఇత్తంగుడి కేవలం 3.5 అడుగుల ఎత్తు మాత్రమే ఉన్నారని, అతడికి అతి సూక్ష్మమైన ఇంప్లాంట్ విధానంతో మోకాలి చిప్పలు మార్చామన్నారు. నారాయణలో ఆర్థో విభాగంలో సమగ్ర చికిత్సలు అందించేందుకు తగిన సౌలభ్యాలు ఉన్నాయన్నారు.



శస్త్ర చికిత్సలు పొందిన వ్యక్తితో వైద్యులు

కార్మికులకు కనీస వేతనాలు అమలు కావాలి

జాలహళ్ళి, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): కార్మికులకు కనీసం వేతనాలు అమలు కావాలని ఐఏఎల్ జాతీయ ప్రధాన కార్యదర్శి మురళీధర అభిప్రాయపడ్డారు. ఏఐటీయూసీ కర్ణాటక స్టేట్ కమిటీ ఆధ్వర్యంలో గురువారం నగరంలోని ఏర్పాటైన జాతీయ సదస్సుకు 20 రాష్ట్రాలనుంచి సుమారు 50మంది ప్రతినిధులు పాల్గొన్నారు. మురళీధర్ మాట్లాడుతూ కనీస వేతనాలపై తాము శాస్త్రీయంగా నిర్వహించిన పరిశోధనపై ఒక కుటుంబంలో సగటున నలుగురు వ్యక్తులు గౌరవప్రదమైన జీవితం గడపాలంటే బెంగళూరు వంటి మెట్రో నగరాల్లో కనీస వేతనం రూ.31,500 ఉండాలన్నారు. రెండేళ్లుగా హైకోర్టులో పోరాటం చేస్తుంటే వివిధ కంపెనీల యజమానులు, పారిశ్రామికవేత్తలు అడుగడుగునా అడ్డంకులు సృష్టించడం బాధాకరమన్నారు. హైకోర్టు తీర్పు కార్మికులకు అనుకూలంగా ఉండగా యాజమాన్యవర్గం మాత్రం డివిజన్ బెంచ్‌కు అప్పీల్ చేశారన్నారు. కార్మికుల సమస్యల పరిష్కారానికి పోరాటం ఒక్కటే సాధ్యమని అభిప్రాయపడ్డారు.

చిన్నకోటె గ్రామ పంచాయతీకి నామినేషన్లు

బంగారపేట, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): తాలూకాలోని చిన్నకోటె గ్రామ పంచాయతీ 2024 ఉప ఎన్నికలకు నామినేషన్లు ప్రారంభమయ్యాయి. జనరల్ కేటగిరీలో తాలూకా పంచాయతీ తాజా మాజీ సభ్యుడు అంబరీశ్ సోదరుడు ఎస్ఎం హరీశ్ నామినేషన్ సమర్పించారు. నామినేషన్ స్వీకరించిన అనంతరం ఎన్నికల అధికారి నారాయణస్వామి మీడియాతో మాట్లాడుతూ చిన్నకోటె గ్రామపంచాయతీ సభ్యుడు ఎస్ ముని వెంకటప్ప మృతితో ఖాళీ అయిన గ్రామ పంచాయతీ సభ్యుడి స్థానానికి ఎన్నికలు జరుగతున్నాయన్నారు. జిల్లా అధికారి ఆదేశాలతో బుధవారం ప్రక్రియ ప్రారంభమైందన్నారు. తొలిరోజు ఒక్క నామినేషన్ కూడా రాలేదని, రెండో రోజు ఎస్ఎం హరీశ్ సమర్పించారన్నారు. ఈనెల 12వరకు నామినేషన్లకు గడువు ఉందన్నారు. ఈ సందర్భంగా సహాయ ఎన్నికల అధికారి దశరథప్ప, తాలూకా పంచాయతీ తాజా మాజీ సభ్యుడు అంబరీశ్, గ్రామపంచాయతీ సభ్యుడు ఆనంద్, లక్ష్మియ్య, సిద్దేశ్ తదితరులు పాల్గొన్నారు.



నామినేషన్ వేస్తున్న హరీశ్

దళిత యువకుడి ఆత్మహత్య కేసులో ముగ్గురి అరెస్టు

పుట్టపర్తిరూరల్, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): బుక్కపట్నం మండలం మారాల గ్రామానికి చెందిన దళిత యువకుడు గౌతమ్ (21) ఆత్మహత్య కేసులో ముగ్గురు నిందితులను అరెస్టు చేసినట్లు పుట్టపర్తి డీఎస్పీ విజయ్‌కుమార్ తెలిపారు. ఈ కేసులో కీలక నిందితుడు రామ్మోహన్ పరారీలు ఉన్నాడన్నారు. స్థానిక డీఎస్పీ కార్యాలయంతో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో నిందితుల అరెస్టు వివరాలను డీఎస్పీ వెల్లడించారు. మారాల గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్త మేకల నారాయణస్వామి బతుకుదెరువు కోసం 8 ఏళ్ల క్రితం పుట్టపర్తికి వచ్చాడు. అతడి కుమారుడు గౌతమ్ ఇంటర్మీడియట్ వరకు చదువుకుని, బెంగళూరులో డెలివరీబాయ్‌గా పనిచేస్తుండేవాడు. నాలుగు నెలల క్రితం మొహరం పండుగకు నారాయణస్వామి కుటుంబంతో మారాల గ్రామానికి వెళ్లాడు. ఇతడు టీడీపీ కార్యకర్త. పండుగ సందర్భంగా ట్రాక్టర్‌ను నారాయణస్వామి గ్రామంలోని వైసీపీ నాయకుడు ఏదులపల్లి రామ్మోహన్ ఇంటిముందు వేగంగా నడిపాడని అతడి కుటుంబ సభ్యులు కొట్టారు. దీనిపై అప్పట్లో బుక్కపట్నం పోలీసుస్టేషన్‌లో నారాయణస్వామి ఫిర్యాదు చేశారు. ఈనెల 2వ తేదీన స్థానిక టీడీపీ నాయకులతో కలిసి బుక్కపట్నం పోలీసుస్టేషన్‌కు వెళ్లి, కేసు విషయమై ఎస్ఐ కృష్ణమూర్తిని ఆరాతీశాడు. తనపై దాడిచేసిన వారిని స్టేషన్‌కు పిలిపించి, న్యాయం చేయాలని కోరాడు. అదేరోజు సాయంత్రం నారాయణస్వామి కుమారుడు గౌతమ్ తన మోటారుసైకిల్‌పై బుక్కపట్నం వస్తుండగా సచివాలయం వద్ద మారాలకు చెందిన రామ్మోహన్, నన్నరాముడు, గోపి, ప్రసాద్ అడ్డుకున్నారు. 'మాపైనే ఫిర్యాదు చేస్తారా.. చంపితే మీకు దిక్కెవరు? మీరేమీ చేసుకోలేరు, మీ బతుకులెందుకు రా.. ఆత్మహత్య చేసుకుని చావాల'ని దూషించారు. దీంతో తీవ్ర మనస్తాపం చెందిన గౌతమ్ పుట్టపర్తికి వస్తూ దారిమధ్యలో పెట్రోల్ కొనుక్కుని, ఇంటికి చేరుకున్నాడు. తండ్రికి జరిగిన అవమానాన్ని తలచుకుని తీవ్ర మనోవేదనకు లోనయ్యాడు. రామ్మోహన్ తదితరులు తన కుటుంబాన్ని హతమారుస్తారన్న భయంతో ఒంటిపై పెట్రోల్‌పోసుకుని, నిప్పటించుకున్నాడు. గమనించిన కుటుంబసభ్యులు వెంటనే పుట్టపర్తి సత్యసాయి జనరల్ ఆసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి బెంగళూరుకు తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం రాత్రి మృతిచెందాడు. దీనిపై కేసు నమోదు చేసిన పోలీసులు విచారణ చేపట్టారు. అందులో భాగంగా నిందితులు నన్నరాముడు, గోపి, ప్రసాద్‌ను గురువారం అరెస్టు చేసినట్లు డీఎస్పీ వెల్లడించారు. ఈ కేసులో కీలక నిందితుడు రామ్మోహన్ పరారీలో ఉన్నాడని, త్వరలోనే పట్టుకుంటామని వివరించారు.

ఇరు పార్టీల నడుమ నలుగుతున్న ఇసుక కాంట్రాక్టర్లు

- చెల్లుబాటు కాని మైనింగ్ శాఖ ఆదేశాలు
- ఓవర్‌లోడ్‌తో రోడ్డుపైనే లారీలు నిలిపివేత
- కప్పం చెల్లించలేదని ఆపివేశారు
- ఇసుక కాంట్రాక్టర్ల ఆరోపణ...

బళ్లారి గాంధీనగర్, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): బళ్లారిలో ఒకప్పుడు అక్రమ మైనింగ్ రవాణాకు పేరుగాంచిన విషయం అందరికి తెలిసిందే. అదే స్థాయిలో బళ్ళారిలో ఇసుక అక్రమ రవాణాకు పేరుగాంచిందని చెప్పవచ్చు. గతంతో పోలిస్తే ప్రస్తుతం ఇసుక రవాణాకు ప్రభుత్వం అడ్డుకట్ట వేయడంతో కొంతమేర ఇసుకాసురలకు అడ్డుకట్ట వేసినట్లయ్యింది. ప్రస్తుం బళ్లారి తాలూకా పరిధిలో అధికారికంగా ఇసుక రీచ్‌లను ప్రభుత్వం బిడ్డంగ్ వేస్తూ రవాణాకు అనుమతి కల్పించింది. ఈ ఇసుక రీచ్‌లు పొందిన కాంట్రాక్టర్లు నగరంలో రెండు పార్టీలకు చెందిన కాంట్రాక్టర్లు నడుపుతున్నారు. రాష్ట్రంలో బీజేపీ అధికారంలో ఉన్న సమయంలో ఇసుక అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేయలేక పోయింది. పార్టీ మారడంతో బళ్ళారిలో ఇసుక రవాణాపై అధికార పార్టీ నాయకులు పట్టు సాధించేందుకు గత ఏడాది నుంచి ఇసుక బిడ్డింగ్‌దారులపై కొరఢా ఝుళిపిస్తున్నారు. అందులో బళ్ళారి నగరం బళ్ళారి రూరల్ నియోజకవర్గాల పరిధిలోకి రావడంతో నగరంలో ఏ దందా జరగాలన్నా, ఏ వ్యాపారం జరగాలన్నా రెండు నియోజకవర్గాల అధినేతల కనుసన్నుల్లోనే జరిగుతుండేవి. ఈ మధ్యకాలంలో బళ్ళారి రూరల్ నియోజకవర్గ నేత ఇబ్బందుల్లో పడడంతో నగరమంతా ఒకరి హస్తంలోకి వెళ్లింది. అధికార పార్టీ నాయకులకు తెలియకుండా.... ప్రతిపక్ష పార్టీ నాయకుల మద్దతుదారులు ఏ పనిచేయలేని పరిస్థితి నెలకొనడంతో రెండు పార్టీల నడుమ అన్నిరకాల వ్యాపారులు, పారిశ్రామికవేత్తలు ఇబ్బందులు పడుతున్నట్లు బహిరంగంగా ఆరోపణలు వినిపిస్తున్నాయి. తాలూకా పరిధిలోని రూపనగుడి, మోకా ఫిర్కా పరిధిలో ఇసుక రీచ్‌లు ఉన్నాయి. ప్రతి రోజూ రాత్రి పగలు ఈ రోడ్లు గుండా యథేచ్ఛగా ఇసుక రవాణా జరుగుతోంది. నిన్నమొన్నటి వరకు బళ్ళారి ఇసుక రవాణా అంతా ఒక బీజేపీకి చెందిన నాయకుడి కనుసన్నల్లో జరుగుతోంది. ప్రస్తుతం ప్రభుత్వం ఇసుక రవాణాపై కొత్తగా తెచ్చిన నిబంధనలు కారణంగా అక్రమంగా ఒక టన్నుకూడా బయటకు రాలేని పరిస్థితి నెలకొంది. దీంతో ఆ నేత ఇసుక రావాణాకు అన్నిరకాల పర్మిట్లు ఉన్నప్పుడు నాయకులకు ఎందుకు కప్పం చెల్లించాలని మొండికేయడంతో ప్రస్తుతం నగరంలో ప్రతిపక్ష పార్టీ నాయకుల చెందిన ఇసుక రవాణా వాహనాలపై కక్షసాధింపు చర్యలు పాల్పడుతున్నట్లు కాంట్రాక్టర్లు ఆరోపిస్తున్నారు. ఇందుకు ఉదాహరణగా గురువారం ఉదయం మోకా ఫిర్కా పరిధిలో ఉన్న రీచ్‌ల నుంచి నాలుగు లారీలకు పైగా ఇసుక రవాణా చేస్తున్న సమయంలో జిల్లా మైనింగ్ అధికారులు మోకా రోడ్డులో ఆపివేశారు. కాంట్రాక్టర్లు అధికారులు ఎందుకు నిలిపారని అడిగితే... నగరంలోకి ఇసుక లారీలు రాకూడదని ప్రజల నుంచి ఫిర్యాదులు వచ్చాయని... అందుచేత నిలిపివేస్తున్నట్లు తెలిపారు. ఇన్ని రోజులు లేని ఫిర్యాదులు ఇపుడేమిటని అధికారులు... ఇసుక కాంట్రాక్టర్ల మధ్య గురువారం రాత్రి అంతా చర్చలు సాగాయి. కక్ష సాధింపు చర్యలో భాగంగానే అధికార పార్టీ నాయకులు తమ లారీలను అడ్డుకుంటున్నారని ఇసుక రవాణా చేసే కాంట్రాక్టర్లు ఆరోపిస్తున్నారు.



మోకా రోడ్డులో గురువారం తెల్లవారు జామున నుంచి నిలిచిపోయిన ఇసుక లారీలు

అధిక లోడు కారణంగానే లారీలను నిలిపాం - డీఎంజీ అధికారి

ఉదయం నుంచి మోకా రోడ్డులో నిలిచిపోయిన లారీల విషయానికి సంబంధించి బళ్లారి జిల్లా మైనింగ్ అధికారి సీనియర్ జియాలజిస్ట్‌ను వివరణ కోరగా ఇసుక లారీలకు సంబంధించి పర్మిట్లు సరిగే ఉన్నాయని, అధిక లోడ్ కారణంగా లారీలను ఆపివేసినట్లు సమాధానం చెబుతున్నారు. మైనింగ్ శాఖకు చెందిన మరో అధికారి ఇసుక లారీల రవాణాకు సంబంధించిన పర్మిట్లలో ఎలాంటి సమస్య లేదని... నగర ప్రజల నుంచి పగటి వేళల్లో లారీలు నగరంలో ప్రవేశించరాదని ఫిర్యాదులు అందిన కారణంగా నిలిపినట్లు సమాధానం చెప్పుతున్నారు.

భక్తిశ్రద్ధలతో ఛట్ పూజ



సూర్యుడికి నైవేద్యం సమర్పిస్తున్న మహిళలు

బెంగళూరు, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఉత్తరాది వాసులు ఆచరించే ఛట్ పూజను నగరంలో గురువారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. నగరంలోని జేపీ పార్క్‌లో ఏర్పాటైన ప్రత్యేక కార్యక్రమంలో మహిళలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. ఉత్తరప్రదేశ్, బీహార్ రాష్ట్రాలలో ఈ విధానం పాటిస్తారు. మోకాలి లోతు నీటిలో నిలబడి సూర్యుడికి అర్ఘ్యం సమర్పిస్తారు. ఇందుకుగాను నాలుగు రోజులపాటు వ్రతం ఆచరించే సంప్రదాయం ఉంది. వెదురుగంప లేదా చాటలో పళ్లను సూర్యభగవానుడికి నైవేద్యంగా సమర్పిస్తారు. బెల్లం, చెరుకు, కొబ్బరి, అరటిపండ్లను ప్రసాదంగా సమర్పించి ఇరుగుపొరుగువారికి ఇస్తారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణలలో మకర సంక్రాంతికి ఆచరించే పండుగకు ఛట్‌పూజకు సారూప్యం ఉంది.

రూ.40 వేల కోట్ల రుణం కోసం సర్కారు యత్నం

బెంగళూరు, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో వివిధ సంక్షేమ పథకాలకు ఆర్థిక వనరులు సమకూర్చుకునేందుకు ప్రభుత్వం రుణం తీసుకునేందుకు సిద్ధమైంది. ఇందుకు రిజర్వుబ్యాంక్ ఆఫ్ ఇండియా కూడా అనుమతి ఇచ్చింది. 40వేల కోట్ల రూపాయలు రుణం తీసుకోదలిచింది. రాష్ట్ర ప్రభుత్వ రుణం 5.53 లక్షల కోట్లకు చేరనుంది. ఇటీవల సీఎం, ఆర్థికశాఖ అధికారులతో సమీక్ష జరిపారు. నిధుల కొరత కారణంగా వివిధ విభాగాలకు గ్రాంట్లు కేటాయించడం సమస్యగా ఉన్నట్టు నిర్ధారించారు. నవంబరు, డిసెంబరు వ్యవధిలో 20వేల కోట్ల చొప్పున ఏడాదిలోగా 40వేల కోట్ల రూపాయలు రుణం పొందేందుకు ఆర్‌బీఐ నుంచి అనుమతులు పొందారు. ఈసారి బడ్జెట్‌లో కేంద్రప్రభుత్వం నుంచి 6,855 కోట్ల రూపాయలు ఓపెన్‌మార్కెట్ విధానంతో 96,840 కోట్లతో కలిపి 1.05 లక్షల కోట్లు రుణం పొందేందుకు రాష్ట్రప్రభుత్వం అంచనా వేసింది. సెప్టెంబరు నెల వరకు 4వేల కోట్ల రూపాయలు సాధారణ రుణాన్ని, రూ.3వేల కోట్లు ఓపెన్ మార్కెట్‌లో రుణం తీసుకున్నారు. అక్టోబరులో 20వేల కోట్ల రూపాయలు అభివృద్ధి కోసం ఆర్‌బీఐ నుంచి అనుమతులు పొందారు. ఈ ఏడాది డిసెంబరు నాటికి 67వేల కోట్ల రూపాయలు పొందినట్లు అవుతుంది.

ద్విచక్రవాహనాలకు నిప్పు



దెబ్బతిన్న వాహనాలివే..

శిడ్లఘట్ట, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): తాలూకాలోని మళమాచన హళ్ళిలో వేర్వేరు ఇళ్లముంగిట ఉంచిన ద్విచక్ర వాహనాలకు దుండగులు నిప్పు పెట్టారు. మంగళవారం రాత్రి చోటు చేసుకున్న ఘటనలో ఐదు వాహనాలు ధ్వంసమయ్యాయి. సుమిత్రమ్మకు చెందిన మూడు వాహనాలు, మునిరాజు సోదరుడు మూర్తికి చెందిన రెండు ద్విచక్రవాహనాలపై దుండగులు పెట్రోల్ పోసి నిప్పంటించారు. హోండా యాక్టివా, ప్యాషన్ ప్రో, డిస్కవరీ 125, ఎక్స్‌ఎల్ 100, బజాజ్ బైక్‌లు నాశనమయ్యాయి. బాధితుల ఫిర్యాదుతో శిడ్లఘట్ట రూరల్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

ప్రమాదంలో గాయపడ్డ యువకుడి మృతి

చిక్కబళ్ళాపుర, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో గాయపడిన యువకుడు చికిత్స ఫలించక బుధవారం మృతి చెందాడు. పట్టణంలోని ప్రముఖ విద్యాసంస్థ పంచగిరి విద్యాసంస్థ ట్రస్టు బోర్డు సభ్యుడు లీలాదేవరాజ్ మనవడు సాయి రాఘవ (24) మృతి చెందాడు. యువకుడి అకస్మిక మృతి పట్ల విద్యాసంస్థ అధ్యక్షులు, సభ్యులు, సిబ్బంది, విద్యార్థులు ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు.




సాయి రాఘవ (ఫైల్)

టమోటా కిలో రూ.30

అనంతపురం రూరల్, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): కక్కలపల్లి మార్కెట్‌లో కిలో టమోటా గరిష్ఠంగా రూ.30తో అమ్ముడుపోయినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రాంప్రసాద్ తెలిపారు. మార్కెట్‌కు గురువారం 1020 టన్నుల టమోటాలు వచ్చాయన్నారు. కిలో సరాసరి ధర రూ.24, కనిష్ఠ ధర రూ.13 పలికినట్లు ఆయన తెలిపారు.

మాతా శిశు మరణాలను తగ్గించేందుకు ప్రణాళికలు : కలెక్టర్

కూడేరు, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి) : మాతా శిశు మరణాలను తగ్గించేందుకు అవసరమైన ప్రణాళికలను తయారు చేసుకోవడంతో పాటు ప్రజారోగ్యం కాపాడడానికి చర్యలు తీసుకుంటున్నట్లు కలెక్టర్ వినోద్‌కుమార్ పేర్కొన్నారు. మండలకేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మోడల్ పీహెచ్‌సీ గా ఎంపిక చేయడంతో గురువారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా డీఎంహెచ్ఓ ఈబీ దేవితో కలిసి పీహెచ్‌సీలోని ప్రతి విభాగాన్ని పరిశీలించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో 45 పీహెచ్‌సీ, 25 అర్బన్ ఆసుపత్రిలో పనిచేస్తున్న వైద్యులు కొద్దిరోజులు జిల్లా కేంద్రంలోనున్న కాన్పుల విభాగంలో పనిచేయాలన్నారు. దీంతో కాన్పులు చేయడంలో మరింత అవగాహన పెరుగుతుందని చెప్పారు. సోమవారం నుంచి పీహెచ్‌సీ వైద్యులకు జీజీహెచ్‌లోని కాన్పుల వార్డులో శిక్షణ ప్రారంభించాలని డీఎంహెచ్ఓను ఆదేశించారు.



తుంగభద్ర నీటి మట్టం : 1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1632.00	1,604.07
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	10,601	0
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	10,241	10,422
నీటి నిల్వ (టీఎంసీలు)	101.77	27.25

రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక



రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులు

బళ్లారిరూరల్, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): తాలుకాలోని గోడేహాళ్ సమీపంలో ఉన్న తిరుమల హైస్కూలు విద్యార్థులు బళ్లారిలో జరిగిన జిల్లా స్థాయి అథ్లెటిక్ పోటీల్లో ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు కరస్పాండెంట్ యల్లప్ప తెలిపారు. వంద మీటర్లు, రెండు వంద మీటర్లు, 400 మీటర్లలో రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారన్నారు. ఎంపికైన విద్యార్థులను కరస్పాండెంట్‌తోపాటు హెచ్‌ఎం నాగరాజు, పీటీ టీచర్ స్కూలు ఇషాక్ అభినందించారు.

ఘనంగా దివాకర్‌బాబు జన్మదినం



వృద్ధాశ్రమంలో అన్నదానం చేస్తున్న అభిమానులు

బళ్లారిరూరల్, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి దివాకర్‌బాబు జన్మదిన వేడుకలను సంగనకల్ ఆదర్శ వృద్ధాశ్రమంలో మాజీ కార్పొరేటర్ రాఘవేంద్ర, దివాకర్ బాబు అభిమానులు జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. వృద్ధులకు బ్రెడ్లు, పండ్లతో పాటు అన్నదానం చేశారు. దివాకర్‌బాబు అభిమానులు ఆనంద్ ఫాతిమా బేగమ్, డీ లక్ష్మీదేవి, తిమ్మా రెడ్డి, గాదిలింగ, మహేష్, కిరణ్, స్వామి పాల్గొన్నారు.

రోడ్డుకు మరమ్మతు చేయండి



బస్సు, కారు ఢీకొన్న దృశ్యం

బళ్లారిరూరల్, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): బళ్లారి ఆటో నగర్ సమీపంలో దెబ్బతిన్న రోడ్డుకు మరమ్మతు చేపట్టాలని స్థానికులు, వాహనదారులు కోరుతున్నారు. ఈ ప్రాంతంలో తరచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని స్థానికులు అంటున్నారు. సంబంధిత అధికారులు స్పందించి రోడ్డును బాగు చేయాలని వాహనదారులు కోరుతున్నారు.

అధికలోడుతో వెళుతున్న వాహనాలపై చర్యలేవీ..?



అధికలోడుతో వెళుతున్న ట్రాక్టర్

సిరుగుప్ప, అక్టోబరు 7(ఆంధ్రజ్యోతి): అధిక లోడుతో వెళుతున్న ట్రాక్టర్లపై చర్యలు తీసుకోవడంలో ఆర్టీవో అధికారులు విఫలమయ్యారు. సిరుగుప్ప తాలుకాలో అధిక లోడు ఉన్న ట్రాక్టర్లు విచ్చలవిడిగా సంచరిస్తున్నా పట్టించుకోవడం లేదు. అధికారులు కళ్లముందే వాహనాలు వెళుతున్నా చూసీచూడనట్లు వ్యవహరించడం గమనార్హం. అధిక లోడు వలన రోడ్డు ప్రమాదాలు జరిగే అవకాశాలు మెండుగా వున్నాయి. ఆర్టీవో అధికారులు ఇప్పటికైనా ఈ విషయంపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

పలువురు ఎస్‌ఐల బదిలీ

బళ్లారిరూరల్, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): బళ్లారి జిల్లాలోని సండూరు ఉప ఎన్నికల సందర్భంగా ఎస్పీ శోభారాణి ఆదేశాలతో పలువురు ఎస్‌ఐలు బదిలీ అయినట్లు పోలీసులు తెలిపారు. సండూరు, తోరణగల్లు, సిరుగుప్ప, బళ్లారి పోలీస్‌స్టేషన్‌లలోని ఎస్‌ఐలను బుధవారం రాత్రి ఇతర పోలీస్ స్టేషన్లకు బదిలీ చేసినట్లు తెలిపారు.

ప్రశాంత పోలింగ్‌కు కర్ఫ్యూ విధించాలి

- డీసీ ప్రశాంత్‌కుమార్ మిశ్రా

బళ్లారి సిటీ, నవంబరు7(ఆంధ్రజ్యోతి): సండూరు అసెంబ్లీ ఉప ఎన్నిక నేపథ్యంలో సెక్షన్ 163 ప్రకారం సండూరు ప్రాంతంలో పోలింగ్ ముగిసిన 48 గంటల పాటు కర్ఫ్యూ విధించాలని డీసీ ప్రశాంత్‌కుమార్ అధికారులను ఆదేశించారు. 13వ తేదీన ఎన్నికలు జరుగుతుండడంతో 11న సాయంత్రం 6 నుంచి నవంబరు 14 సాయంత్రం వరకు పోలింగ్ ఉంటుందన్నారు. ఇండియన్ సివిల్ ప్రొటెక్షన్ కోడ్, ఇతర వర్తించే చట్టాలు జిల్లా మెజిస్ట్రేట్‌గా ఉన్న



కలెక్టర్ ప్రశాంత్ కుమార్ మిశ్రా వివిధ షరతులు విధించాలని ఆదేశించారు. సండూరు అసెంబ్లీ నియోజకవర్గం(95) పరిధిలో ఐదుగురు కంటే ఎక్కువమంది గుమిగూడడం, ఊరేగింపు లేదా సభ నిషేధించామన్నారు. పోలింగ్ ముగిసిన తరువాత శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా ఇంటింటికీ ప్రచారం నిర్వహించాలన్నారు. ఎన్నికల అభ్యర్థి లేదా మద్దతుదారులతో సహా ఐదుగురు కంటే ఎక్కువ మంది గుమికూడదన్నారు. ఆయుధం, కత్తి లేదా శరీరానికి హాని కలిగించే ఏ ఆయుధాన్ని తీసుకుని వెళ్లరాదన్నారు. పోలింగ్ కేంద్రాలకు 100మీటర్లలోపు పేలుడు పదార్థాలు తీసుకెళ్లడం నిషేధమన్నారు. అన్ని పోలింగ్ కేంద్రాల చుట్టు 200మీ కవరేజ్ ఏరియా నిషిద్ధ ప్రాంతమన్నారు. వ్యక్తిగతంగా పోలింగ్ బూత్‌లకు వెళ్లి ఓటు వేయాలని కలెక్టర్ సూచించారు.

సండూరులో 144 సెక్షన్ అమలు

బళ్లారిరూరల్: సండూరు ఉప ఎన్నిక సందర్భంగా 11న సాయంత్రం 6 నుంచి 14వ తేదీ సాయంత్రం 6 గంటల వరకు 144 సెక్షన్ అమలులో ఉంటుందని కలెక్టర్ ప్రవీణ్ కుమార్ మిశ్రా ఒక ప్రకటనలో తెలిపారు. పోలింగ్ బూత్‌లకు దూరంగా వుండాలని, 48 గంటల పాటు బళ్లారి, సండూరు, కంప్లి తాలుకాల్లో 144 సెక్షన్ విధిస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు.

పదవీ విరమణ చేసిన వారికి కొత్త పెన్షన్ ఇవ్వాలి

బళ్లారి సిటీ, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): పదవీ విరమణ చేసిన వారికి కొత్త పెన్షన్ ఇవ్వాలని డిమాండ్ చేస్తూ గురువారం హొసపేట నగరంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట కర్ణాటక రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్స్ యూనియన్ ఆధ్వర్యంలో నిరసన నిర్వహించారు. కర్ణాటక రాష్ట్ర 7 వేతన కమిటీ సిఫార్సుల ఆధారంగా, రాష్ట్ర ప్రభుత్వం కొత్త వేతనం, పెన్షన్‌కు ఆదేశించింది. ప్రభుత్వ ఆదేశం మేరకు పదవీ విరమణ పొందిన వారికి కొత్త పెన్షన్ ఇవ్వాలన్నారు. అయితే పదవీ విరమణ పొందిన వారికి ఇప్పటివరకు కొత్త పెన్షన్ ఇవ్వలేదు. ఈవిషయంలో బ్యాంక్ అనేక సాకులు చూపుతోంది. దీంతో విశ్రాంత ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వ ఉత్తర్వు ఇచ్చి రెండు నెలలు గడుస్తున్నా బ్యాంకులు చెబుతున్న సమాధానాలు సహేతుకంగా లేవు. అంతేకాకుండా జూలై నుంచి రావాల్సిన మెయింటెనెన్స్ అలవెన్స్ (తుట్టి భత్యం) కూడా ఇప్పటి వరకు రాకపోవడంతో పెన్షనర్లు జీవనోపాధి పొందేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నాయకులు



తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న పెన్షనర్లు

బి.తాయప్పనాయక్, ఎం.జంబయ్యనాయక్, సునీతా అన్వేకల్, చన్నమ్మ ,నాగరాజ పత్తర్ పాల్గొన్నారు.

గృహజ్యోతికి పేర్లు నమోదు చేసుకోండి

బళ్లారి సిటీ, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): బళ్లారి, కురుగోడు తాలూకా విద్యుత్ వినియోగదారులు గృహజ్యోతి పథకం కింద నమోదు చేసుకోని పక్షంలో సమీపంలోని జెస్కామ్ కార్యాలయానికి వెళ్లి నమోదు చేసుకోవాలని బళ్లారి రూరల్ సబ్ డివిజన్ అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ మోహన్‌బాబు ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ హామీ పథకాల్లో ఒకటైన గృహజ్యోతి ఉచిత విద్యుత్ పథకం ఇప్పటికే అమలులో ఉందన్నారు. చాలా మంది విద్యుత్ వినియోగదారులు ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకున్నారన్నారు. పేర్లు నమోదు చేసుకోని విద్యుత్ వినియోగదారులు జీఎస్‌పీ, మీటర్ రీడర్, బ్రాంచ్ ఆఫీసర్లు లేదా జెస్కామ్ బళ్లారి రూరల్ సబ్-డివిజనల్ కార్యాలయం లేదా కురుగోడు సబ్ డివిజనల్ కార్యాలయంలో సంప్రదించి నమోదు చేసుకోవచ్చని ఆయన తెలిపారు.

కొత్త అభ్యర్థిని ఎన్నుకోండి



ప్రచారం చేస్తున్న బీజేపీ నాయకులు

బళ్లారి, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): దాదాపు 25 ఏళ్ల పాటు ఇక్కడ సండూరులో తుకారాం, సంతోష్ లాడ్ ఇద్దరూ ప్రజానాయకులుగా గెలిచారని, ఇక్కడ ఏ అభివృద్ధి పనులు చేశారో ప్రజలకు తెలపాలని మాజీ మంత్రి బీజేపీ నాయకుడు గాలి జనార్దన్‌రెడ్డి ప్రశ్నించారు. గురువారం బీజేపీ అభ్యర్థి బంగారు హనుమంత, కార్యదర్శి దివాకర్, మున్నాబాయ్, అలీఖాన్. ఇతర నాయకులతో కలిసి గ్రామాల్లో ప్రచారం చేశారు. బీజేపీ అభ్యర్థి హనుమంతను గెలిపించాలని కోరారు. కేంద్రంలో బీజేపీ అధికారంలో ఉంది, రానున్న రోజుల్లో రాష్ట్రంలో కూడా బీజేపీ అధికారంలోకి వస్తుందన్నారు. ప్రతి సమస్యనూ పరిష్కరిస్తామని, ప్రజలకు అండగా ఉంటామని ఆయన చెప్పారు. ప్రచారంలో ఆయనతో పాటు పలువురు బీజేపీ నాయకులు ఉన్నారు.

కుడితినిలో బీజేపీ ప్రచారం



బీజేపీ అభ్యర్థికి మద్దతుగా ప్రచారం చేస్తున్న కౌన్సిలర్

కంప్లి, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): కుడితిని పట్టణంలో 3వ వార్డు కౌన్సిలర్ దుగ్గెప్ప బీజేపీ అభ్యర్థి బంగారు హనుమంతప్ప గెలుపు కోసం ఇంటింటా జోరుగా ప్రచారం చేపట్టారు. సూరి, సంపత్, శ్రీనివాస్, మంజు, మారేష్, ఉమేష్, రుద్రప్ప, నాగరాజు, శంకరప్ప, లాలెప్ప, రాఘవేంద్ర ప్రచారంలో పాల్గొన్నారు.

జల వనరుల సంరక్షణ అందరి బాధ్యత



మొక్కకు నీరుపోసి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న జిల్లా అదనపు అధికారి

రాయచూరు, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): జలవనరులను సంరక్షించుకోవడాన్ని ప్రతి ఒక్కరూ బాధ్యతగా గుర్తించాలని అడిషనల్ జిల్లాధికారి శివానంద భజంత్రి అన్నారు. నీతి ఆయోగ్ సూచనల మేరకు నిర్వహిస్తున్న జలోత్సవం కార్యక్రమంలో భాగంగా గురువారం నగరంలోని జడ్పీ సమావేశ మందిరంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ జల వనరుల మూలాలను గుర్తించడం వాటిని సంరక్షించడంతో పాటు అందుబాటులో ఉన్న నీటి వనరులను పరిమితంగా వినియోగించుకోవాలన్నారు. ఈ విషయంలో జిల్లాపై ప్రత్యేక బాధ్యత ఉందన్నారు. నీతి ఆయోగ్ జిల్లాను ప్రత్యేక అవసరాలు ఉన్న జిల్లాగా గుర్తించిన నేపథ్యంలో అందుబాటులో ఉన్న అన్ని సహజ వనరులను సద్వినియోగం చేసుకుంటూ జిల్లా అభివృద్ధికి పని చేయాలన్నారు.

అన్నదాతను వణికిస్తున్న తాటాకు తెగుళ్లు

● పూర్తిగా దెబ్బతిన్న వరి పంట



పసుపురంగులో గడ్డలుగా ఏర్పడిన దృశ్యం

కంప్లి, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): తాటాకు తెగుళ్లతో వరి రైతులు అల్లాడిపోతున్నారు. కంప్లి తాలుకా తుంగభద్ర నది ఒడ్డున ఉన్న సన్నాపురం, బెళగోడుహాళ్, ఇటిగి, ముద్దాపురం, నారాయణస్వామి క్యాంపు, బసవేశ్వర క్యాంపు రైతులు వరి పంటకు తాటాకు, ఉల్లికోడు తెగుళ్లతో సతమతమవుతున్నారు. పంటలు చేతికొచ్చే సమయంలో ఇలా తెగుళ్లసోకి పూర్తిగా నష్టపోతున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కేవలం ఆగస్టు నెలలో నాట్లు వేసిన పంటలకు మాత్రం ఎలాంటి తెగుళ్లు లేవని, దిగుబడులు బాగా వచ్చాయన్నారు. సెప్టెంబరులో వేసిన పంటలకు తెగుళ్లసోకి పంటలు పూర్తిగా నాశనమయ్యాయని తెలిపారు. నారాయణస్వామి క్యాంపు రైతు అచ్యుతరాయ వర్మ మాట్లాడుతూ చల్లదనం రావడంతో పంటలపై తెగుళ్ల ప్రభావం అధికమైందన్నారు. వాటితో పాటు పెద్దపెద్ద ఉంటలు (గడ్డలు) ఏర్పడ్డాయన్నారు. దీని వల్ల దిగుబడి తగ్గుతుందన్నారు. ఎకరాకు 50 సంచులు దిగుబడి రావాల్సి వుండగా కేవలం 30 నుంచి 35 సంచులు మాత్రమే వస్తున్నాయన్నారు. అలాగే ఉల్లికోడు వైరస్‌తో పూర్తిగా కడ్డి మాదిరిగా తయారై పంట నాశనమవుతోందన్నారు. దీంతో పంట పూర్తిగా నష్టపోయామన్నారు. ఈ యేడాది పెట్టుబడులు ఎక్కువ దిగుబడులు తక్కువయ్యాయన్నారు. రైతు పంటల కోసం పెడుతున్న రసాయనిక ఎరువులు, క్రిమికీటక మందులు ఎక్కువవుతున్నాయన్నారు. వీటి నివారణ కోసం ఎకరాకు బిసినతోనాజల్, ఆస్తోడిన్ ఒక లీటరు నీటిలో 1.5 ఎంఎల్ చొప్పున కలుపుకుని పిచికారి చేస్తే కొంతమేర తెగుళ్లను నివారించవచ్చునని వ్యవసాయ అధికారులు తెలిపారు.

తుంగభద్రపై త్వరలో సమావేశం

● టీబీ బోర్డు చైర్మన్ పాండ్య



బోర్డు చైర్మన్ పాండ్య, పక్కన ఎస్‌ఈ నీలకంఠారెడ్డి, సెక్రటరీ ఓఆర్‌కే రెడ్డి

బళ్లారి, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): తుంగభద్ర డ్యాం పరిస్థితిని అధ్యయనం చేసేందుకు రెండుమూడు రోజుల్లో బోర్డు సమావేశం నిర్వహిస్తామని టీబీపీ బోర్డు చైర్మన్ పాండ్య తెలిపారు. డ్యాం పరిస్థితి, క్రస్ట్ గేట్ల మార్పు తదితర అంశాలపై చర్చించి నిర్ణయాలు తీసుకుంటామని అన్నారు. బళ్లారిలోని ఎల్లెల్సీ అతిథి గృహంలో ఆయన ఆంధ్రజ్యోతితో మాట్లాడారు. తుంగభద్ర డ్యాం నిర్మాణం జరిగి 70 ఏళ్లు గడిచిందని, అప్పటి క్రస్ట్ గేట్లు బలహీనపడ్డాయని అన్నారు. ఈ కారణంగానే 19వ క్రస్ట్ గేటు కొట్టుకుపోయిందని అన్నారు. రబీ సీజన్ పూర్తి కాగానే గేట్ల మార్పు, అభివృద్ధి పనులు చేపడతామని అన్నారు. బోర్డు సమావేశంలో తుది నిర్ణయం తీసుకుంటామని అన్నారు. క్రస్ట్ గేట్ల మార్పు కోసం ఏపీ, తెలంగాణ అనుమతి, సీడబ్ల్యూసీ అనుమతి తీసుకుంటామని తెలిపారు.

భక్తిశ్రద్ధలతో ఛట్ పూజ



కాలువ వద్ద ఛట్ పూజ నిర్వహిస్తున్న ఇతర రాష్ట్రాల ప్రజలు

తోరణగల్లు, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): స్థానిక పరిశ్రమలలో పనిచేసేందుకు వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వారు గురువారం ఛట్ పూజను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఇక్కడ దీపావళి, దసరా, సంక్రాంతి పండుగలు వైభవంగా నిర్వహిస్తారు. బీహార్, ఉత్తరప్రదేశ్ తదితర ప్రాంతాలలో ఛట్ పూజను మూడు రోజుల పాటు ఉపవాస దీక్షతో గంగా మాతను తలుచుకుంటూ అందరూ బాగుండాలని సూర్యదేవునికి పూజలు నిర్వహిస్తారు. ఈ సంప్రదాయాన్ని ఇక్కడే ఉన్న బీహార్, ఉత్తరప్రదేశ్ ప్రాంతాల వారు ఈ పూజను నిర్వహించారు.

వైభవంగా శ్రీవారి కల్యాణోత్సవం



ప్రత్యేక పూజలు చేస్తున్న అర్చకులు

రాయచూరు, నవంబరు 7 (ఆంధ్రజ్యోతి): నగరంలోని నవోదయ విద్యా సంస్థల ఆధ్వర్యంలో శ్రీవారి కల్యాణోత్సవం వైభవంగా సాగుతోంది. తిరుమల తిరుపతి దేవస్థానానికి చెందిన అర్చకుల బృందం ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు సాగే కల్యాణోత్సవంలో భాగంగా గురువారం రాత్రి సంప్రదాయ పద్ధతుల్లో నిర్వహించే ఎదురుకోలు కార్యక్రమాన్ని ఉత్సాహంగా నిర్వహించారు. కార్యక్రమంలో సంస్థ చైర్మన్ ఎస్.ఆర్.రెడ్డి ట్రస్ట్ సభ్యులు ఉన్నారు.

అన్నపూర్ణ విజయానికి మద్దతునిస్తాం

కంప్లి, నవంబరు 7(ఆంధ్రజ్యోతి) : సండూరు ఉప ఎన్నిక 14న జరగనున్న పోలింగ్ కోసం కుడితినిలోని దళిత సంఘాలు కాంగ్రెస్ అభ్యర్థి అన్నపూర్ణమ్మ గెలుపునకు మద్దతు ఇస్తామని దళిత సంఘాల ప్రముఖులు కెంచప్ప, నరసప్ప తెలిపారు. కుడితిని పట్టణంలో దళిత సంఘాలు విలేకరుల సమావేశంలో మాట్లాడారు. తమ నాయకుడు తుకారామ్ నాలుగుసార్లు ఎమ్మెల్యే అయ్యి అండగా వుంటూ అభివృద్ధి చేశారన్నారు. కాంగ్రెస్ పార్టీ అంబేడ్కర్ సిద్ధాంతాలను దృష్టిలో వుంచుకుని తమకు సహకరిస్తోందన్నారు. బీజేపీకి దళిత సంఘాల నుంచి ఓటుతో గుణపాఠం చెబుతామన్నారు. మంత్రి సంతోష్‌లాడ్, ఎంపీ తుకారామ్ మార్గదర్శనంలో ఇంతవరకు వెళుతున్నామని, సమస్యలను పరిష్కరిస్తున్నారని, అభివృద్ధిని దృష్టిలో వుంచుకుని కాంగ్రెస్ పార్టీ గెలుపుకు కృషి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో పంపాపతి, ఆనందకుమార్, కౌన్సిలర్లు లెనిన్, మల్లికార్జున, వెంకటేష్, గిరీష్, హనుమంతు, సంజీవ మల్లికార్జున, విశ్వనాథ్ పాల్గొన్నారు.

దుమ్ముతో ప్రయాణికుల పాట్లు



గుంతలమయమైన కొట్టాల రోడ్డు

కంప్లి, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): కంప్లి నుంచి కొట్టాలకు వెళ్లే రోడ్డు మార్గంలో సాయిబాబా ఆలయం వద్ద సన్నాపురం కాలువ నుంచి కొట్టాల వైపు అర కిలోమీటరు రోడ్డు గుంతలమయం కావడంతో దుమ్మూధూళితో ప్రయాణికులు, స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కొట్టాల, ఎమ్మిగనూరు, నెల్లూడి, జానూరు, శంకర్‌సింగ్ క్యాంపు, తదితర గ్రామాలు వెళ్లే ప్రజలు ఆవేదన వ్యక్తం చేశారు. కంప్లి నుంచి కురుగోడుకు 30 కిలోమీటర్లు వుండగా 29 కిలోమీటర్లు ఎలాంటి సమస్య లేదని, కేవలం అరికిలోమీటరులో కంకరతేలిన రోడ్డుతోనే సమస్య అన్నారు. స్థానిక ఎమ్మెల్యే జేఎన్ గణేష్ ఈ రోడ్డుపైనే ప్రయాణిస్తున్నారే గానీ ఈ అరికిలోమీటరు రోడ్డుపై దృష్టి సారించడం లేదన్నారు. అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని కోరారు.

ఏపీఎంసీలో చెత్త తొలగింపు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

బళ్లారి గాంధీనగర్, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): బళ్లారి వ్యవసాయ ఉత్పత్తుల మార్కెట్ సమితి(ఏపీఎంసీ)లో నెలకొన్న సమస్యలపై గురువారం ఆం ధ్రజ్యోతిలో ప్రచురితమైన 'పట్టించుకోరా' కథనానికి మార్కెట్ పాలక మం డలి స్పందించింది. గురువారం ఉదయం మార్కెట్‌లో రోజుల తరబడి పేరుకపోయిన వ్యర్థాలను ఎక్స్‌కవేటర్లను ఉపయోగించి తొలగించారు. అలాగే మార్కెట్ ప్రాంగణంలో ఉన్న నీటి గుంటల్లో గేదెలు దొర్లుతున్న ప్రాంతాలను మట్టితో పూడ్చివేశారు. గతంలో ఏపీఎంసీలో నెలకొన్న సమస్యలను పాలనా మండలి దృష్టికితీసుకొచ్చి సమస్యలను పరిష్కరించిన విషయం పాఠకులకు విదితమే.



ఎక్స్‌కవేటర్‌తో చెత్తను శుభ్రం చేస్తున్న దృశ్యం

హోసూరు జోన్

ఇళ్ల నిర్మాణ పనుల పరిశీలన

● నాణ్యతను పాటించండి: కలెక్టర్

హోసూరు(కృష్ణగిరి), నవంబరు 7(ఆంధ్రజ్యోతి): కృష్ణగిరి జిల్లాలోని 10 పంచాయతీ యూనియన్లలో వివిధ పథకాల కింద ఇళ్ల నిర్మాణాలు జరుగుతున్నాయి. ఇళ్ల నిర్మాణాల ప్రగతిని కలెక్టర్ సరయు స్వయంగా పరిశీలించారు. మొదటి దశలో 3,827 మంది లబ్ధిదారులకు ఉత్తర్వులు జారీ చేసి ఇళ్ల నిర్మాణాలు కొనసాగుతున్నాయి. శూలగిరి పంచాయతీ పరిధిలోని 42 గ్రామ పంచాయతీల్లో ఒక్కొక్కటి రూ.3.50 లక్షలతో 117 ఇళ్లను నిర్మిస్తున్నారు. అదేవిధంగా కెలమంగళం పంచాయతీ యూనియన్‌లో 28 గ్రామ పంచాయతీల్లో 200 ఇళ్ల నిర్మాణానికి వర్క్ ఆర్డర్లు ఇవ్వగా ప్రస్తుతం 189 ఇళ్ల నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి. నిర్మాణాలను పరిశీలించిన అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ లబ్ధిదారులు తమ ఇళ్ల నిర్మాణ పనుల్లో నాణ్యత ఉండేలా చూసుకోవాలని, అదే విధంగా ఇళ్ల నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని గ్రామీణాభివృద్ధి శాఖ అధికారులు, ఇంజనీర్లను ఆదేశించినట్లు తెలిపారు. పథకం క్రింద శూలగిరి పంచాయతీ యూనియన్ పరిధిలో ఒక్కొక్కరికి రూ.3.50 లక్షలు తుప్పుగానపల్లి పంచాయతీ, కనించూర్ గ్రామంలో లబ్ధిదారులు పార్వతమ్మ ఎల్లప్ప, మల్లప్ప, యూనియన్ పరిధిలోని జెక్కేరి సంచాయతీ చిన్నట్టి గ్రామంలో 13 మంది లబ్ధిదారుల ఇళ్ల నిర్మాణ పనులను స్వయంగా పరిశీలించారు. సర్వేలో జిల్లా అభివృద్ధి అధికారులు ఉమా శంకర్, సతీశ్ బాబు, గోవిందరాజు, కుమార్, సూపర్‌వైజర్లు, శాఖాధికారులు పాల్గొన్నారు.



ఇంటి నిర్మాణ పనులను పరిశీలిస్తున్న కలెక్టర్ సరయు

రోడ్డు ప్రమాదంలో ముగ్గురి మృతి

హోసూరు, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): ద్విచక్రవాహనం అదుపు తప్పి రోడ్డు పక్కన ఉన్న గోతిలో పడిన ఘటనలో ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు మృతి చెందిన సంఘటన గురువారం చోటు చేసుకుంది. డెంకణీకోట సమీపానగల జోగట్టి గ్రామానికి చెందిన కూలి పనిచేసే నాగరాజ్(45), అతని భార్య రత్నమ్మ(35), కుమారుడు నవీన్ (13)లు మధ్యాహ్నం ద్విచక్రవాహనంపై తళి సమీపంలోని మునీశ్వరుని ఆలయానికి వెళ్లారు. ఆ తర్వాత తళి-కాడుకెంబత్తళ్లి రహదారిపై అడవిగుండా వెళ్తుండగా రోడ్డుపక్కన ఉన్న 20 అడుగుల లోతు గోతిలో పడి అక్కడిక్కడే మృతి చెందారు. స్థానికులు గమనించి తళి పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే ఘటనా స్థలానికి వచ్చిన పోలీసులు ముగ్గురి మృతదేహాలను బయటికి తీసి పోస్టుమార్టం నిమిత్తం డెంకణీకోట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

అన్నాడీఎంకే సౌత్‌జోన్ కార్యవర్గ సమావేశం



సమావేశంలో పాల్గొన్న అన్నాడీఎంకే కార్యకర్తలు

హోసూరు, నవంబరు 7(ఆంధ్రజ్యోతి): మత్తిగిరిలో మున్సిపల్ అన్నాడీఎంకే సౌత్‌జోన్ కార్యవర్గ సభ్యుల సలహా సమావేశం సౌత్‌జోన్ లీగ్ కార్యదర్శి పిఆర్ వాసుదేవన్ నేతృత్వంలో జరిగింది. పార్టీ జిల్లా ఉప కార్యదర్శి జి.సురేశ్ స్వాగతం పలికారు. హోసూరు అసెంబ్లీ నియోజకవర్గం దక్షిణ ప్రాంతంలో పోలింగ్ ఏజెంట్లు నియామకం, ఓటరు జాబితా పరిశీలన, పార్టీ అభివృద్ధి పనులపై చర్చించారు. మున్సిపల్ మాజీ కౌన్సిలర్ శ్రీనివాసరావు, సర్కిల్ కార్యదర్శులు గోపాలరామచంద్రన్, ప్రకాశ్, సుబ్రహ్మణి, తిరునావుక్కరసు, శివ, రంజిత్, విజి, నాగరాజ్, నారాయణస్వామి, ఆర్.అనుమంతన్, తదితరులు పాల్గొన్నారు.

లైంగిక వేధింపుల నియంత్రణపై అవగాహన

హోసూరు(కృష్ణగిరి), నవంబరు 7(ఆంధ్రజ్యోతి): బాలికలు, మహిళలపై లైంగిక వేధింపుల నియంత్రణపై ప్రత్యేక అవగాహన కార్యక్రమం జరిగింది. కృష్ణగిరి జిల్లా కలెక్టర్ కార్యాలయ సమావేశంలో సాంఘిక సంక్షేమ, మహిళా హక్కుల శాఖ తరపున 'బాలికలకు రక్షణ కల్పించండి, బాలికలను బోధించండి' అనే ప్రాజెక్టు క్రింద లైంగిక వేధింపుల నియంత్రణ చట్టం 2013పై అవగాహన కార్యక్రమానికి కలెక్టర్ కె.ఎం.సరయు నేతృత్వంలో గురువారం జరిగింది. కలెక్టరేట్ సహా అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, ప్రైవేట్ సంస్థలు, పాఠశాలలు, కళాశాలలు, ఆసుపత్రుల్లో తప్పనిసరిగా అంతర్గత కమిటీని ఏర్పాటు చేయాలి, లేని పక్షంలో ఈ చట్టం ప్రకారం చర్యలు తీసుకుంటామని తెలిపారు. జిల్లా సాంఘిక సంక్షేమ అధికారి చట్టం యొక్క పరిధి, దాని ద్వారా లభించే రక్షణలు, లైంగిక వేధింపులు, ఉద్యోగులు, అంతర్గత కమిటీ విధులతో



మాట్లాడుతున్న కలెక్టర్ సరయు

సహా చట్టం యొక్క వివరాలను వివరించారు. సమావేశంలో కలెక్టర్ ఇంటర్వ్యూ అసిస్టెంట్ జనరల్ పుష్ప, జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ అధికారి శక్తి సుభాషిణితో పాటు అన్ని శాఖల అధికారులు, ప్రైవేట్ అధికారులు పాల్గొన్నారు.